మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 18-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 199 Issue: 199

Published from Jagitial
www.evarthalu.com

18 జనవరి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 5:59 తిథి అమావాస్య రా. 1:19వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పూర్వాషాఢ ఉ. 10:05 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం హర్షణ రా. 9:03 వరకు కరణం చతుష్పాద మ. 12:44 వరకు నాగవ రా. 1:19వరకు వర్జ్యం సా. 6:47 నుండి రా. 8:30 వరకు దుర్ముహూర్తం సా. 4:30 నుండి సా. 5:14 వరకు రాహుకాలం సా. 4:36 నుండి సా. 5:59 వరకు యమగండం మ. 12:26 నుండి మ. 1:49 వరకు గుళికాకాలం మ. 3:13 నుండి సా. 4:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు తె. 5:01 నుండి ఉ. 6:43 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

కరోనా దెబ్బకు ఆహారంపై కాస్త శ్రద్ధ పెట్టినం..
హెూటల్‌కు బదులు ఇంటి తిండిపై దృష్టి పెట్టినం..
కెమికల్ ఫుడ్ వద్దంటూ ఆర్గానిక్ బాట పట్టినం..
'హెూమ్ మేడ్' అంటూ జాగ్రత్తలు తీసుకుంటున్నం..
కానీ, అదే కొత్త యాపారంగా మార్కెట్‌లోకి వచ్చింది..
మన బలహీనతే మళ్లీ కల్తీ దందాగా ఏలుతోంది..
'హెూమ్ మేడ్' అని చెప్తే నిజమేనని నమ్ముతున్నం..
కల్తీ ఫుడ్ తిని మళ్లీ రోగాల బారిన పడుతున్నం..

# హెూమ్ మేడ్.. నయా వంచన



## ఇంట్లో తయారీ అంటూ కల్తీ దందా

## అన్ హైజీనిక్ పదార్థాలతో తయారీ

### నాసిరకం సరుకులతో వంటలు.. ప్రజల బలహీనతలే యాపారం



ఒకప్పుడు హెూమ్ మేడ్ అంటే నమ్మకానికి మారుపేరు. ఇంట్లో వాడే వస్తువులతో, శుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తారనే నమ్మకంతో ప్రజలు వీటిని ఇష్టపడేవారు.

కానీ, నేడు అదే నమ్మకం కల్తీ వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. బయటి ఆహారం కంటే ఇంట్లో చేసినవి మేలన్న సామాన్యుడి బలహీనతే ఈ దందాకు పునాది.

ఉరుకుల పరుగుల జీవితంలో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఆహారం కోసం ప్రజలు హెూమ్ మేడ్ ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే ప్రజల బలహీనతగా మార్చుకున్న కొందరు అక్రమ వ్యాపారులు, నాసిరకం, కల్తీ పదార్థాలను ఇంట్లో చేసినవి అంటూ మార్కెట్లోకి వదులుతున్నారు.

### తప్పని రోగాలు

కల్తీ నూనెలు, కృత్రిమ రంగుల వల్ల ప్రజలు గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడుతున్నారు. హెూమ్ మేడ్ కదా అని నమ్మి పిల్లలకు పెట్టడం వల్ల వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది.

(ఈవార్తలు - సండే స్టోరీ)

బయటి హెూటల్ తిండి కంటే, ఎవరో ఒకరు ఇంట్లో శుభ్రంగా వండితే అది ఆరోగ్యానికి మేలని సామాన్యుడు భావించాడు. కానీ, ఇప్పుడు ఆ నమ్మకమే ఒక పెద్ద వ్యాపార వనరుగా మారిపోయింది. అమ్మ చేతి వంట, అచ్చమైన పల్లెటూరి రుచి అనే ఆకర్షణీయమైన పేర్ల వెనుక ఒక భయంకరమైన కల్తీ సామ్రాజ్యం విస్తరిస్తోంది. ఒకప్పుడు హెూమ్ మేడ్ అంటే పరిమితంగా, నాణ్యతతో కూడిన తయారీ. కానీ నేడు ఇది భారీ వ్యాపారంగా రూపాంతరం చెందింది. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా చేయడానికి చాలామంది వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. మనుషుల ఆరోగ్య కాంక్షను, వారి బలహీనతను ఆసరాగా చేసుకుని కల్తీ పదార్థాలను మార్కెట్లోకి అంటగడుతున్నారు. ఇంటి పేరుతో సాగుతున్న ఈ దందాలో వినియోగదారుడు కేవలం కస్టమర్ మాత్రమే కాదు, తరువాయి 2 వ పేజీలో...



సండే స్పెషల్ స్టోరీ
Sunday Special Story

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,378 |
| వెండి (గ్రాము): | రూ.310 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,814 |





# సికింద్రాబాద్ ఉద్రిక్తం

### బీఆర్ఎస్ ర్యాలీకి పోలీసుల నో పర్మిషన్.. నగరంలో పలుచోట్ల అరెస్టులు.. ఆంక్షలు

సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లా, ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నేతలు చేపట్టిన శాంతియుత ర్యాలీ శనివారం ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకుని పలువురు నేతలను అరెస్ట్ చేయడంతో హైదరాబాద్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

సికింద్రాబాద్, జనవరి 17 (ఈవార్తలు): ఉదయం నుంచే పోలీసుల ఆంక్షలు ర్యాలీకి అనుమతి లేదంటూ నార్త్ జోన్ పోలీసులు అర్ధరాత్రి ప్రకటించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాలు, ఎంజీ రోడ్, మోండా మార్కెట్, జనరల్ బజార్ ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేయడంతో సాధారణ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర తరువాయి 2 వ పేజీలో...

### నా శత్రువును బండకేసి కొట్టిన.. నడుం విరిగి

# ఫాంహౌజ్‌లో పడుకున్నడు

### ఇప్పుడు నిరక్షరాస్యత, పేదరికమే నా శత్రువులు.. మహబూబ్‌నగర్ సభలో సీఎం రేవంత్



'నాకు ఎవరు శత్రువులు లేరు. రాజకీయ ప్రత్యర్థులు ఉంటే వారిని ఎన్నికల్లో ఓడించామన్నారు. నా శత్రువు అనుకున్న వారిని 2023 బండకేసి కొట్టాను. 2024 గుండు సున్న ఇప్పించాను. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్, సర్పంచ్ ఎన్నికల్లో గెలిచాం. ఆయన నడుము విరిగి ఫామ్ హౌస్ లో పడుకుంటే ఆయనను నా శత్రువు అని నేను ఎలా అనుకుంటా' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

మహబూబ్‌నగర్, జనవరి 17 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా శనివారం రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంవీఎస్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే బీఆర్ఎస్ కు తాను సవాల్ విసిరానని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన ఇళ్లలోనే వాళ్లు ఓట్లు అడగాలి, ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లలోనే మేం ఓట్లు అడుగుతామని చాలెంజ్ చేశామ్నారు. నా శత్రువులు అక్షరాస్యత లేకపోవడం, పేదరికం, మహిళలకు, విద్యకు అన్యాయం చేసే వారు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



శాస్త్రవేత్తలు పారదర్శకత కలిగిన సోలార్ ప్యానెళ్లను అభివృద్ధి చేశారు. ఈ ప్యానెళ్లను కిటికీ అద్దాలుగా వాడుకోవచ్చు. అదే సమయంలో సూర్యరశ్మిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ ప్యానెళ్లను స్మార్ట్ ఫోన్‌పై గ్లాస్‌గానూ వాడుకోవచ్చు.


# కూతెట్టిన వందేభారత్ స్లీపర్



### ప్రారంభించిన ప్రధాని మోదీ

### నేడు కామాఖ్యకు చేరుకోనున్న తొలి రైలు

కోల్‌కతా: భారత్ లో తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్ ప్రెస్ రైలుకు ఇవాళ ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. హౌరా-కామాఖ్య మార్గంలో దీన్ని ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే ఈ ప్రీమియం రైలుకు సంబంధించిన ఫీచర్లు, ఇతర వివరాలను, ఫొటోలను రైల్వే శాఖ షేర్ చేసింది. ఇప్పటికే పరుగులు తీస్తున్న వందే భారత్ రైళ్లకు దేశవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో స్లీపర్ రైళ్ల రాక రైల్వే రూపురేఖల్ని పూర్తిగా మార్చబోతోంది. ప్రధాని మోదీ శనివారం పశ్చిమ బెంగాల్ లోని మాల్దా టౌన్ నుంచి తొలి వందే భారత్ స్లీపం



### హైదరాబాద్ మేయర్..

# మహిళే!

## 50 శాతం కార్పొరేషన్లు మహిళలకే

### మున్సిపల్ రిజర్వేషన్ల జాబితా ప్రకటన

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మేరకు మునిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఖరాయిన రిజర్వేషన్ల జాబితాను విడుదల చేశారు. వీటిలో 50 శాతం కార్పొరేషన్లను మహిళలకు రిజర్వేషన్ చేసినట్లు వెల్లడించారు.

హైదరాబాద్, జనవరి 17 (ఈవార్తలు) : మొదట ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు చేశామని , లాటరీ ద్వారా 50శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని వివరించారు. రాష్ట్రంలోని పది కార్పొరేషన్లలో ఎస్సీ, ఎస్టీ ఒకటి చొప్పున, బీసీ మహిళలకు -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

18.1.2026

మేషం: బంధు మిత్రుల నుండి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులతో దూర ప్రయాణాలు సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు దక్కుతాయి.

వృషభం: కుటుంబ సభ్యుల ప్రవర్తన శిరోబాధ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులలో అవరోధాలు కలుగుతాయి. వ్యాపారాలలో శ్రమధిక్యత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు తప్పవు. మిత్రులతో కలహా సూచనలున్నవి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

మిధునం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాల పరంగా ఇబ్బందులు అధిగమించి లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో పాత జ్ఞాపకాలు పంచుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి.

కర్కాటకం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశములు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సన్నిహితుల నుండి కీలక విషయాలు తెలుస్తాయి.

సింహం: ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. చేపట్టిన పనులందు కార్యాటంకములు తప్పవు. వ్యాపారాలు కొంత మందకోడిగా సాగుతాయి. ఉద్యోగస్థులకు స్థానచలనాలుంటాయి. ఇంటాబయట సమస్యలు చికాకు పరుస్తాయి. దైవ సంబంధిత కార్యక్రమాలలో ఆసక్తిగా పాల్గొంటారు.

కన్య: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. ఆర్థిక ఇబ్బందులు కొంత చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు కలుగుతాయి. సంతాన విద్యా విషయాలలో కొంత శ్రద్ద వహించాలి.

తుల: రాజకీయ సభ సమావేశములకు ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. సంతాన శుభకార్య విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి.

వృశ్చికం: వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రులతో విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. ప్రముఖులతో కొత్త పరిచయాలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు.

ధనస్సు: పుణ్యక్షేత్ర దర్శనాలు చేసుకుంటారు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమౌతాయి. బంధు మిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది.

మకరం: ధన సంభంధిత వ్యవహారాలలో ఆలోచనలు స్థిరత్వం ఉండదు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం వలన ఆర్థిక నష్టాలు తప్పవు. నిరుద్యోగ యత్నాలు మందగిస్తాయి. బంధు మిత్రులతో కీలక వ్యవహారాలు చర్చిస్తారు.

కుంభం: ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. దైవ సేవా కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభిస్తాయి.

మీనం: దాయాదులతో ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. గృహ నిర్మాణ పనులు వాయిదా వేస్తారు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులందు శ్రమ అధికమౌతుంది. ఇతరులతో ఆకారణంగా విబేదిస్తారు.



# ...'నయా' వంచన

ఒక బాధితుడిగా మారుతున్నాడు. చాలామంది వ్యాపారులు చిన్న చిన్న ఇళ్లను లేదా గదులను అద్దెకు తీసుకుని, అక్కడ భారీ ఎత్తున తయారీ కేంద్రాలను నడుపుతున్నారు. బయట బోర్డు మాత్రం హోమ్ మేడ్ అని పెడతారు. కానీ లోపల జరిగేది మాత్రం పక్కా కమర్షియల్, అన్-హైజీనిక్ వ్యవహారం.

## ధర తక్కువ - ప్రమాదం ఎక్కువ

మధ్యతరగతి ప్రజలను ఆకర్షించడానికి అనుసరించే ప్రధాన మార్గం.. తక్కువ ధర. నాణ్యమైన ముడిసరుకులతో ఇంట్లో చేస్తే అయ్యే ఖర్చు కంటే చాలా తక్కువ ధరకే వీరు ఉత్పత్తులను విక్రయిస్తారు. ఇంత తక్కువకు ఎలా వస్తోంది? అని వినియోగదారుడు ఆలోచించకపోవడమే కల్తీ వ్యాపారుల పెట్టుబడి. వాస్తవానికి, తక్కువ ధర కోసం వాడే నాసిరకం పదార్థాలు దీర్ఘకాలంలో కిడ్నీ వ్యాధులు, కాలేయ సమస్యలు, క్యాన్సర్ వంటి మహమ్మారులకు కారణమవుతున్నాయి. పచ్చళ్లు, కారం పొడులు, పిండి వంటల తయారీకి మార్కెట్లో దొరికే అత్యంత చౌకైన, నాసిరకం ముడి సరుకులను వాడుతున్నారు. పురుగులు పట్టిన పప్పులు, రంగు వేసిన మిరప పొడులు వీటిలో ప్రధానమైనవి. హోటళ్లలో లేదా బ్రాండెడ్ షాపుల్లో ధరలు ఎక్కువగా ఉన్నాయని భావించే వారిని ఆకర్షించడానికి, వీరు తక్కువ ధరకే పదార్థాలను విక్రయిస్తారు.

## నిఘా ఎక్కడ?

ఆహార భద్రతా ప్రమాణాల నిబంధనల ప్రకారం తయారీ కేంద్రం ఉండాలి. కానీ, ఈ హోమ్ మేడ్ ముసుగులో ఉన్న కేంద్రాల్లో కనీస వెలుతురు, గాలి ఉండవు. ఈగలు, మురికి మధ్యే ప్యాకింగ్ జరుగుతోంది. వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా అచ్చమైన అమ్మ చేతి వంట అంటూ ఆకర్షణీయమైన వీడియోలతో ప్రజలను బుట్టలో వేసుకుంటున్నారు. నిజమేనని నమ్మే మన కళ్లు.. వాటిని కొనిపించేస్తున్నాయి, తినిపించేస్తున్నాయి. హోమ్ మేడ్ పేరుతో జరిగే ఈ వ్యాపారాల్లో 90 శాతానికి పైగా ఎటువంటి ఆహార భద్రత ప్రమాణాల సంస్థ అనుమతులు ఉండవు. ఇళ్లలో తయారు చేస్తున్నాం కదా అని చెప్పి తనిఖీల నుండి తప్పించుకుంటున్నారు. సోషల్ మీడియాలో జరిగే విక్రయాలపై నియంత్రణ లేకపోవడం ఈ దందాకు మరింత కలిసి వస్తోంది. అధికారులు హోటళ్లపై మాత్రమే కాకుండా, హోమ్ మేడ్ పేరుతో విచ్చలవిడిగా సాగుతున్న ఇలాంటి తయారీ కేంద్రాలపై కూడా నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

## జర జాగ్రత్త

- హోమ్ మేడ్ అని చెప్పగానే నమ్మేయకుండా, తయారీదారుని వివరాలు, వారి గత చరిత్రను పరిశీలించాలి.
- ఆకర్షణీయమైన ప్యాకింగ్ చూసి, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోకూడదు.
- చిన్న వ్యాపారమైనా సరే, ప్రభుత్వం నుంచి అనుమతి ఉందో లేదో చూడాలి. మీరు ఏదైనా కల్తీని గమనిస్తే వెంటనే ఎఫ్ఎస్ఎస్ఏఐ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.
- వీలైతే పదార్థాలు తయారయ్యే చోటుకు వెళ్లి అక్కడి పరిశుభ్రతను గమనించడం ఉత్తమం.

## చివరగా..

హోమ్ మేడ్ అని బోర్డు పెడితే వెళ్లి కొనడం కాదు.. వీలైనంత వరకు ఇంట్లోనే తయారుచేసుకొని తినడం. వ్యాపారం చేయడం తప్పు కాదు, కానీ పది మంది ప్రాణాలతో చెలగాటం ఆడుతూ లాభాలు గడించడం నేరం. వినియోగదారులు అప్రమత్తంగా ఉన్నప్పుడే ఇలాంటి అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. కేవలం తక్కువ ధరను చూసి మోసపోకుండా, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి.



# ఫాంహౌజ్‌లో పడుకున్నడు

మొదటి పేజీ తరువాయి

శత్రువు అన్నారు. పేదరికాన్ని తెలంగాణ సరిహద్దు వరకు తరిమడమే నా లక్ష్యం అన్నారు. రాజకీయాలకు అతీతంగా పాలమూరును అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## పాలమూరును బీఆర్ఎస్ పట్టించుకోలేదు

పదేళ్ల పాలనలో కేసీఆర్ పాలమూరును పట్టించుకోలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మంజూరు చేసిన ఒక్క ప్రాజెక్ట్ అయినా పాలుమూరులో ఉందా? అని సీఎం ప్రశ్నించారు. 'మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం సహా పాలమూరును అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ. మేం అధికారంలోకి వచ్చాకే ప్రాజెక్టుల్లో వేగం పెరిగింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు. కానీ ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్ధండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇచ్చాం. పాలమూరు బిడ్డ సీఎం కావడం వారికి నచ్చలేదు. మనం వాళ్ల మోచేతి నీళ్లు తాగాలని కోరుకున్నారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చ పెడితే ఆ పార్టీకి ముఖం చాటేశారు. అందరం కలిసి మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఐఎంను తీసుకొద్దాం. పాలమూరు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే రానివ్వలేదు. మారీచుడు, సుబాహులను శుక్రాచార్యుడు పంపించి.. మేం చేసే ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు. మాకు కూడా వ్యూహాలు, ఎత్తుగడలు తెలుసు. ఎవరు ఎలా వచ్చినా ప్రజలు వారిని తరిమికొడతారు. డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చిన ఇళ్లలోనే వాళ్లు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊళ్లోనే మేము ఓట్లు అడుగుతాం. మా సవాల్‌ను బీఆర్ఎస్ స్వీకరిస్తుందా?' అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 'హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎం పాలమూరు బిడ్డే. 75 తర్వాత మళ్లీ ఆ అవకాశం ఇప్పుడొచ్చింది. 17 ఏళ్లలో అన్ని చట్టసభల్లో పనిచేశా. ప్రజలకు ఏదైనా మేలు చేయాలనే తపన తప్ప నాకు మరో ఆలోచన లేదు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సాగుతున్నాం. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ పాలమూరు జిల్లాకు వెలుగులు తేవాలని ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. కానీ విద్య పరంగా, సాగునీటి పరంగా నాటి పాలకులు నిర్లక్ష్యం వహించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అప్పట్లో డీకే అరుణ, విఠల్ రావు కలిసి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వివరించారు. అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు ఆ ప్రాజెక్టు మంజూరైంది. కల్వకుర్తిలో మాడ్గులకు నీళ్లు రావాలంటే రూ. 75 కోట్లు అవసరం వచ్చాయి.



# కూతెట్టిన వందేభారత్ స్లీపర్

మొదటి పేజీ తరువాయి

రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు నంబర్ 27575 హౌరా నుంచి కామాఖ్య వరకూ ప్రయాణించబోతోంది. హౌరాలో సాయంత్రం 6:20కు బయలుదేరగా, కామాఖ్యకు ఆదివారం ఉదయం 08:20కు ఇది చేరుకోనుంది. రైలును ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ విద్యార్థులతో కలిసి రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అనుభవాల్ని అడిగి తెలుసుకున్నారు. వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు, ఇప్పుడు తీసుకొచ్చిన స్లీపర్ రైలుపై విద్యార్థులు ప్రధానికి తమ అనుభవాలు వివరించారు. కాగా, వందేభారత్ స్లీపర్‌లో మొత్తం 823 మంది ప్రయాణించే అవకాశం ఉంది. రైలులో మొత్తం 16 ఏసీ కోచ్‌లు ఉన్నాయి. వీటిలో 11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, మరొక ఫస్ట్ ఏసీ కోచ్ ఉన్నాయి. ఈ వందే భారత్ స్లీపర్ ఎక్స్ ప్రెస్ గరిష్ట వేగం గంటకు 180 కిలోమీటర్లు. రెగ్యులర్ గా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణించబోతోంది. ఈ రైలును వారానికి 6 రోజుల పాటు నడపబోతున్నారు. హౌరా నుంచి గురువారాల్లో, కామాఖ్య నుంచి బుధవారాల్లో ఈ రైలు ప్రయాణించనుంది. అలాగే న్యూ జల్పాయ్ గురితో సహా 13 స్టాప్‌లు ఇచ్చారు. ప్రతీ స్టాప్ లోనూ 10 నిమిషాల హాల్ట్ ఉంటుంది. ఆ తర్వాత ప్రయాణికుల స్పందన, ఇతర అంశాల ఆధారంగా మార్పులు, చేర్పులు చేస్తారు. హౌరా నుంచి కామాఖ్యకు వందే భారత్ స్లీపర్ రైలులో థర్డ్ ఏసీ ఛార్జీ 2299గా నిర్ణయించారు. అలాగే న్యూజల్పాయ్ గురికి 1334, మాల్దాకు 960గా నిర్ణయించారు. అలాగే ఏసీ టూటైర్ లో కామాఖ్యకు 2970, న్యూజల్పాయ్ గురికి 1724, మాల్దాకు 1240 వసూలు చేస్తారు. ఫస్ట్ ఏసీలో కామాఖ్యకు 3640, న్యూజల్పాయ్ గురికి 2113, మాల్దాకు 1520 వసూలు చేస్తున్నారు.

# హైదరాబాద్ మేయర్.. మహిళే!

మొదటి పేజీ తరువాయి

మూడు మేయర్ పోస్టులకు రిజర్వేషన్ కల్పించామన్నారు. మరో 5 జనరల్‌కు కేటాయించామని చెప్పారు.

కార్పొరేషన్లు - రిజర్వేషన్

1. జీహెచ్ఎంసీ - మహిళ (జనరల్)
2. నల్లగొండ - మహిళ (జనరల్)
3. మహబూబ్‌నగర్ - మహిళ (బీసీ)
4. జీడబ్ల్యూఎంసీ - అన్ రిజర్వ్‌డ్
5. కరీంనగర్ - బీసీ (జనరల్)
6. ఖమ్మం - మహిళ (జనరల్)
7. నిజామాబాద్ - మహిళ (జనరల్)
8. మంచిర్యాల - బీసీ (జనరల్)
9. కొత్తగూడెం - ఎస్టీ (జనరల్)
10. రామగుండం - ఎస్సీ (జనరల్)

# సికింద్రాబాద్ ఉద్రిక్తం

మొదటి పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంజీ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగిన నిరసనకారులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అరెస్టయ్యారు. నల్ల జెండాలు, నల్ల కండువాలతో 'సికింద్రాబాద్ బచావో' అంటూ నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీతాఫల్‌మండీ చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశ్ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత ర్యాలీని చిలకలగూడ పోలీసులు అడ్డుకున్నారు. నోముల ప్రకాశ్‌తో పాటు ఆయన అనుచరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పడే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ పద్మారావు గౌడ్‌ను పోలీసులు ఉదయం నుంచే గృహ నిర్బంధం చేశారు. ఆయన నివాసం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ చర్యపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ, ప్రజా సమస్యలపై గొంతు ఎత్తితే ప్రభుత్వం పోలీసులతో అణచివేయాలని చూస్తోందని విమర్శించారు. శాంతి ర్యాలీ సందర్భంగా ఎంజీ రోడ్‌లో కార్పొరేటర్ డాక్టర్ సామల హేమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. ముందుగా అనుమతులు ఇచ్చి అర్ధరాత్రి వాటిని రద్దు చేయడం అన్యాయమని ఆమె మండిపడ్డారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాధన కోసం ఉద్యమానికి పిలుపునిచ్చిన యువనేత, బీఆర్ఎస్ కంటెస్టెడ్ ఎంపీ తలసాని సాయికిరణ్ యాదవ్‌ను పోలీసులు గోషామహల్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, రెట్టించిన ఉత్సాహంతో పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన ప్రకటించారు. నిరసనల కారణంగా మోండా



మార్కెట్, జనరల్ బజార్, బాటా పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. పోరాటం మరింత ఉధృతం చేస్తామన్న నేతలు సికింద్రాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక జిల్లా, ప్రత్యేక కార్పొరేషన్ సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.

## మున్సిపాలిటీలు - రిజర్వేషన్

ఇల్లందు - బీసీ మహిళ
జగిత్యాల - బీసీ మహిళ
జనగామ - బీసీ జనరల్
భూపాలపల్లి - బీసీ జనరల్
ఐజా - బీసీ జనరల్
వడ్డేపల్లి - బీసీ జనరల్
అలంపూర్ - బీసీ జనరల్
బిచ్‌కుందా - బీసీ జనరల్
కామారెడ్డి - బీసీ మహిళ
బాన్సువాడ - బీసీ మహిళ
ఆసిఫాబాద్ - బీసీ జనరల్
కాగజ్ నగర్ - బీసీ మహిళ
దేవరకొండ - బీసీ మహిళ
చెన్నూరు - బీసీ మహిళ
మెదక్ - బీసీ మహిళ
ములుగు - బీసీ మహిళ
కొల్లాపూర్ - బీసీ మహిళ
అచ్చంపేట - బీసీ మహిళ
నాగర్ కర్నూలు - బీసీ జనరల్
దేవరకొండ - బీసీ మహిళ
మద్దూర్ - బీసీ జనరల్
పెద్దపల్లి - బీసీ జనరల్
మంథని - బీసీ జనరల్
వేములవాడ - బీసీ జనరల్
షాద్ నగర్ - బీసీ జనరల్
జిన్నారం - బీసీ జనరల్
జహీరాబాద్ - బీసీ జనరల్
గుమ్మడిదాల - బీసీ జనరల్
సిద్దిపేట - బీసీ జనరల్
గజ్వేల్ - బీసీ మహిళ
దుబ్బాక - బీసీ మహిళ
హుజూర్ నగర్ - బీసీ జనరల్
తాండూర్ - బీసీ జనరల్
పరిగి - బీసీ మహిళ
కొత్తకోట - బీసీ మహిళ
ఆత్మకూరు - బీసీ మహిళ
నర్సంపేట - బీసీ మహిళ
ఆలేరు - బీసీ మహిళ
భైంసా- అన్ రిజర్వ్‌డ్
నిర్మల్- ఉమెన్ జనరల్
భీమ్[illegible]గల్- ఉమెన్ జనరల్
ఆర్మూర్- ఉమెన్ జనరల్
బోధన్- అన్ రిజర్వ్‌డ్
సుల్తానాబాద్- అన్ రిజర్వ్‌డ్
సిరిసిల్ల- ఉమెన్ జనరల్
శంకరపల్లి- అన్ రిజర్వ్‌డ్
చేవెళ్ల- అన్ రిజర్వ్‌డ్
ఇబ్రహీంపట్నం- అన్ రిజర్వ్‌డ్
ఆమన్ గల్- అన్ రిజర్వ్‌డ్
కొత్తూరు- అన్ రిజర్వ్‌డ్
సదాశివపేట- ఉమెన్ జనరల్
నారాయణఖేడ్- అన్ రిజర్వ్‌డ్
ఆందోల్ జోగిపేట- అన్ రిజర్వ్‌డ్
సంగారెడ్డి- ఉమెన్ జనరల్
ఇస్నాపూర్- ఉమెన్ జనరల్
సూర్యాపేట- అన్ రిజర్వ్‌డ్
తిరుమలగిరి- అన్ రిజర్వ్‌డ్
కోదాడ- ఉమెన్ జనరల్
నేరేడుచర్ల- అన్ రిజర్వ్‌డ్
కొడంగల్- అన్ రిజర్వ్‌డ్
వనపర్తి- ఉమెన్ జనరల్
అమరచింత- అన్ రిజర్వ్‌డ్
పెబ్బేరు- అన్ రిజర్వ్‌డ్
వర్ధన్నపేట- అన్ రిజర్వ్‌డ్
పోచంపల్లి- అన్ రిజర్వ్‌డ్
యాదగిరిగుట్ట- ఉమెన్ జనరల్
భువనగిరి- ఉమెన్ జనరల్
చౌటుప్పల్- ఉమెన్ జనరల్
ఆదిలాబాద్ - మహిళ ( జనరల్)
అశ్వారావుపేట- మహిళ ( జనరల్)
పరకాల- అన్ రిజర్వ్‌డ్
కోరుట్ల- మహిళ ( జనరల్)
రాయికల్- అన్ రిజర్వ్‌డ్
మెట్ పల్లి - అన్ రిజర్వ్‌డ్
గద్వాల- మహిళ ( జనరల్)
యల్లారెడ్డి - అన్ రిజర్వ్‌డ్
సత్తుపల్లి- మహిళ ( జనరల్)
వైరా- మహిళ ( జనరల్)
మధిర- మహిళ ( జనరల్)
జడ్చర్ల - అన్ రిజర్వ్‌డ్
తొర్రూర్ -అన్ రిజర్వ్‌డ్
మరిపెడ - మహిళ ( జనరల్)
కేతనపల్లి - మహిళ ( జనరల్)
బెల్లంపల్లి- మహిళ ( జనరల్)
రామాయంపేట- మహిళ ( జనరల్)
నర్సాపూర్ - మహిళ ( జనరల్)
తూర్పాన్ - మహిళ ( జనరల్)
ఆలియాబాద్- మహిళ ( జనరల్)
కల్వకుర్తి- మహిళ ( జనరల్)
చందాపూర్- అన్ రిజర్వ్‌డ్
నకిరేకల్- అన్ రిజర్వ్‌డ్
హాలియా- అన్ రిజర్వ్‌డ్
మిర్యాలగూడ- మహిళ ( జనరల్)
చిట్యాల- మహిళ ( జనరల్)
నారాయణపేట-మహిళ ( జనరల్)
కోస్గి- అన్ రిజర్వ్‌డ్
మక్తల్- అన్ రిజర్వ్‌డ్
ఖానాపూర్- అన్ రిజర్వ్‌డ్

# కోర్టు పర్మిషన్‌తో వస్తాం

## బ్రహ్మాండంగా ర్యాలీ నిర్వహిస్తాం.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జనవరి 17 (ఈవార్తలు): ఈ రెండేళ్ల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పేర్లు మార్చడం తప్ప చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. టీఎస్‌ను టీజీగా మార్చారని తెలిపారు. దానివల్ల ఎవరికి లాభం జరిగిందని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి.. కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ రాజముద్ర నుంచి చార్మినార్‌ను తీసేస్తానని అంటున్నాడని తెలిపారు. ఇప్పటికే కాకతీయ కళాతోరణాన్ని తీసేశారని పేర్కొన్నారు. దిక్కుమాలిన తుగ్లక్ పనులు తప్ప.. రాష్ట్రానికి చేసింది శూన్యమని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. మీకు అధికారం ఇచ్చింది ప్రజల హక్కులు కాపాడటానికి అని రేవంత్ సర్కార్‌కు సూచించారు. కానీ మీరు చేస్తున్నదేంటి అని ప్రశ్నించారు. రెండేళ్లలో హైదరాబాద్‌లో ఒక్క కొత్త రోడ్డు వేశావా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఒక్క ఫ్లై ఓవర్ కట్టావా? అని ప్రశ్నించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని విమర్శించారు. సికంద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసిన పార్టీగా కాంగ్రెస్ మిగిలిపోతుందని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ ఐడెంటిటీని తొలగించాలని చూస్తున్నాడని మండిపడ్డారు. అందుకే అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై ర్యాలీకి సిద్ధమయ్యారని తెలిపారు. పార్టీలకు అతీతంగా శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చారని అన్నారు. శాంతి ర్యాలీకి బీఆర్ఎస్ పార్టీని కూడా ఆహ్వానించారని తెలిపారు. మా ప్రజాప్రతినిధులమంతా సంఘీభావం తెలుపుదామని సిద్ధమయ్యామని పేర్కొన్నారు. కానీ వేలాది మందిని ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని తెలిపారు. తమను కూడా తెలంగాణ భవన్‌లో నిర్బంధించారని చెప్పారు. అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడుతామని తెలిపారు. కోర్టు పర్మిషన్‌తో బ్రహ్మండంగా మళ్లీ ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ బిడ్డల మనోభావాలనుబీఆర్ఎస్ పార్టీ గౌరవిస్తుందని తెలిపారు. అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు తీసుకొచ్చారని పేర్కొన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని అన్నారు. హైదరాబాద్‌లో నాలుగు జోన్లు ఉంటే.. ఆరు జోన్లు చేసుకున్నామని అన్నారు. ఇన్ని చేసినా హైదరాబాద్ అస్తిత్వాన్ని బీఆర్ఎస్ ఏనాడూ టచ్ చేయలేదని స్పష్టం చేశారు. ఉన్న జిల్లాలను తీసేయడానికి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త కలెక్టరేట్లు అద్భుమని మీ మంత్రి కోమటిరెడ్డి అన్నాడని గుర్తుచేశారు. చేతనైతే సికింద్రాబాద్‌ను డెవలప్ చెయ్.. అంతేతప్ప ఫోర్త్ సిటీ పేరుతో తుగ్లక్ పనులు చేయకు అని రేవంత్ రెడ్డికి సూచించారు.

# నా ఇంటిని కూల్చేసిన వారికి శాస్తి : కంగనా



ముంబై: బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల్లో థాకరే కుటుంబ సుదీర్ఘ ఆధిపత్యానికి తెరపడింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత శివసేన (యూబీటీ) అధికారాన్ని కోల్పోయింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. ఈ ఫలితాలపై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తన ఇంటిని కూల్చివేసిన వారికి తగిన శాస్తి జరిగిందని వ్యాఖ్యానించారు. మొత్తం 227 వార్డులున్న బీఎంసీలో అధికారం చేపట్టేందుకు 114 సీట్లు అవసరం కాగా, బీజేపీ-ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన కూటమి 118 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఇందులో బీజేపీ 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించగా, షిండే వర్గం 29 సీట్లు గెలుచుకుంది. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) కేవలం 65 సీట్లకే పరిమితమైంది. కాంగ్రెస్ 24, ఎంఎన్ఎస్ 6 స్థానాల్లో విజయం సాధించాయి. ఈ ఫలితాల తర్వాత కంగనా రనౌత్ స్పందిస్తూ తన పాత సంఘటనను గుర్తు చేసుకున్నారు. 2020లో ఉద్ధవ్ థాకరే ప్రభుత్వ హయాంలో బీఎంసీ అధికారులు తన కార్యాలయంలోని కొంత భాగాన్ని కూల్చివేశారు. "నా ఇల్లు పడగొట్టారు, రేపు మీ అహంకారం బద్దలవుతుంది" అని అప్పట్లో ఆమె చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకుంటున్నారు.

# జల్లికట్టు వీరులకు ప్రభుత్వ ఉద్యోగాలు!

**తమిళనాడు సీఎం స్టాలిన్ కీలక ప్రకటన**



చెన్నై: తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శనివారం ప్రపంచ ప్రఖ్యాత అలంగనల్లూరు జల్లికట్టు వేడుకల్లో పాల్గొని రెండు కీలక ప్రకటనలు చేశారు. అత్యధిక ఎద్దులను అదుపు చేసిన జల్లికట్టు వీరులకు పశుసంవర్ధక, అనుబంధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించారు. అలాగే, రూ. 2 కోట్ల వ్యయంతో అలంగనల్లూరులో జల్లికట్టు ఎద్దుల కోసం ఒక అత్యాధునిక శిక్షణా, చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పొంగల్ పండుగ వేడుకల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి చెన్నై నుంచి మధురై చేరుకున్న సీఎం స్టాలిన్‌కు మంత్రి మూర్తి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం వాడివాసల్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నుంచి ఆయన పోటీలను ఆసక్తిగా తిలకించారు. విజేతలైన క్రీడాకారులకు, ఎద్దుల యజమానులకు బంగారు ఉంగరాలను బహూకరించారు. జనవరి 15న పొంగల్ రోజున అవనియాపురంలో జల్లికట్టు సీజన్ ప్రారంభమైంది. శుక్రవారం పళమేడులో మరో ప్రధాన పోటీ జరిగింది. ఈ రెండు పోటీల్లోనూ క్రీడాకారులు, ఎద్దులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాయి. విజేతలకు కార్లు, ట్రాక్టర్ల వంటి విలువైన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ, మధురైని శౌర్యానికి ప్రతీకగా అభివర్ణించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అలంగనల్లూరు జల్లికట్టు తమిళ ప్రజల స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. తమ ద్రవిడ మోడల్ పాలనలో కలైంజర్ శతాబ్ది గ్రంథాలయం వంటివి తమిళ వారసత్వాన్ని, జ్ఞానాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనాలని పేర్కొన్నారు. తాజా ప్రకటనలు క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తాయని, సంక్షేమంతో పాటు తమిళ సంప్రదాయాలు వర్ధిల్లడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని స్టాలిన్ తెలిపారు.

## చాట్ జీపీటీ యాడ్స్ బాట

న్యూయార్క్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ ఇకపై ప్రకటనల బాట పట్టబోతోంది. ఓపెన్ ఏఐ విలువ 500 బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ భారీగా పెరుగుతున్న నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు వచ్చే కొన్ని వారాల్లో చాట్‌జీపీటీలో అడ్వర్టైజ్‌మెంట్లను పరీక్షించనున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. మొదట అమెరికాలో ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే ఈ ప్రకటనలు కనిపించనున్నాయి. అయితే ప్రో, ఎంటర్‌ప్రైజ్ యూజర్లకు మాత్రం యథావిధిగా యాడ్స్ ఉండవని సంస్థ స్పష్టం చేసింది. దాదాపు బిలియన్ మంది వినియోగదారులు ఉన్నప్పటికీ, చాలా తక్కువ మంది మాత్రమే చెల్లింపు సేవలు వినియోగిస్తుండటంతో కొత్త ఆదాయ మార్గాల అవసరం ఏర్పడింది. శక్తిమంతమైన కంప్యూటింగ్ వ్యవస్థల కోసం భారీగా ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రకటనలు చాట్‌జీపీటీ సమాధానాలను ప్రభావితం చేయవని, యూజర్ల వ్యక్తిగత డేటా ప్రకటనదారులకు అందుబాటులో ఉండదని ఓపెన్‌ఏఐ హామీ ఇచ్చింది. యూజర్ నమ్మకం, అనుభవమే తమకు మొదటి ప్రాధాన్యమని సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

## గ్రీన్‌లాండ్ ఆక్రమణను వ్యతిరేకిస్తూ టారిఫ్‌లు

**ప్రపంచ దేశాలకు ట్రంప్ మరో వార్నింగ్**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రపంచ దేశాలకు మరోసారి టారిఫ్ ల హెచ్చరికలు చేశారు. గ్రీన్ లాండ్ ను ఎలాగైనా తీసేసుకుంటామని ఇప్పటికే స్పష్టం చేసిన ట్రంప్.. ఈ విషయంలో తమతో విభేదించే దేశాలకు టారిఫ్ లతో బదులిస్తామని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా జాతీయ భద్రత విషయంలో గ్రీన్ లాండ్ చాలా కీలకమని, అయితే సులువుగా, కాకపోతే కఠిన పద్ధతిలోనైనా దానిని స్వాధీనం చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ఆక్రమణను వ్యతిరేకిస్తే సహించబోనని చెప్పారు. ప్రపంచ దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ పరోక్షంగా డెన్మార్క్ ను నేరుగా హెచ్చరించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## జేఈఈ మెయిన్ హాల్‌టికెట్లు రిలీజ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2026 సెషన్-1 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు (అడ్మిట్ కార్డులు) విడుదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం ఈ అడ్మిట్ కార్డులను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో లాగిన్ అయి వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 29 వరకు జేఈఈ మెయిన్ పేపర్-1 (బీ.టెక్/బీ.ఇ.) పరీక్షలు జరగనున్నాయి. అయితే, ఎన్టీఏ ప్రస్తుతం జనవరి 21, 22, 23, 24 తేదీల్లో పరీక్షలు రాసే అభ్యర్థులకు మాత్రమే హాల్ టికెట్లను జారీ చేసింది. జనవరి 28, 29 తేదీల్లో పరీక్షలు ఉన్నవారికి అడ్మిట్ కార్డులను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇక పేపర్-2 (బీ.ఆర్క్/బీ.ప్లానింగ్) పరీక్ష జనవరి 29న జరగనుంది. పరీక్షలు రోజూ రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత అందులోని పరీక్షా కేంద్రం, తేదీ, షిఫ్ట్ వంటి వివరాలను జాగ్రత్తగా సరిచూసుకోవాలని ఎన్టీఏ సూచించింది. ఏవైనా సమస్యలుంటే యవవమ్ఖిఅఅఏత్ఖు.ఖిఛి.అఅకు ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. పరీక్షా కేంద్రంలోకి ప్రవేశానికి అడ్మిట్ కార్డు తప్పనిసరి.

## రిపబ్లిక్ డే రోజున ఉగ్ర ముప్పు

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ వేడుకలను లక్ష్యంగా చేసుకుని ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద సంస్థలు దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. హర్యానా, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం ఉందని, అక్కడ హైఅలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీయడానికి ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తోన్న ఉగ్రవాద సంస్థలు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నాయని పేర్కొన్నాయి. గత ఏడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు సంభవించిన విషయం తెలిసిందే.

## రాహుల్‌ను అవమానించినట్లే!

**తన ఓటమిపై జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు**



సంగారెడ్డి, జనవరి 17 (ఈవార్తలు): గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తన భుజంపై చేయి వేసి తనను గెలిపించాలని ఇక్కడి ప్రజలను కోరితే, వారు ఓడించారని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఇక తాను జీవితంలో సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నానని ఆయన స్పష్టం చేశారు. ఇళ్ళ స్థలం లేని పేదలతో సంగారెడ్డిలోని గంజి మైదానంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, రాహుల్ గాంధీని ఇక్కడకు పిలిచి తాను అవమానించినట్లుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తన కోసం రాహుల్ గాంధీ సంగారెడ్డికి వచ్చి గెలిపించాలని ప్రచారం చేశారని, కానీ ఫలితం మాత్రం తనకు అనుకూలంగా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇది మరిచిపోలేని విషయమని ఆయన అన్నారు. తన ఓటమికి ఇక్కడి పేద ప్రజలు కాదని, మేధావులు, పెద్దలని విమర్శించారు. సంగారెడ్డిలో ఈసారి తన భార్య నిర్మల పోటీ చేసినా తాను ప్రచారానికి కూడా రానని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తానని, సంగారెడ్డిలో మాత్రం చేయబోనని అన్నారు.

## నల్లగొండ ఇక కార్పొరేషన్

**నేరుగా కేంద్ర నిధులు పొందే అవకాశం**

**సీఎంకు మంత్రి కోమటిరెడ్డి ధన్యవాదాలు**

**సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని వెల్లడి**

నల్లగొండ, జనవరి 17 (ఈవార్తలు): నల్లగొండ పట్టణానికి మున్సిపల్ కార్పొరేషన్ హోదా లభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్లగొండను కార్పొరేషన్‌గా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో నల్లగొండను ఒక 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేషన్ హోదా రావడంతో ఇకపై అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు పొందే అవకాశం కలిగిందని మంత్రి కోమటిరెడ్డి వివరించారు. కేవలం 25 నెలల్లోనే ఈ హోదాను సాధించామని, దీనివల్ల గతంతో పోలిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళికలను కూడా ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌తో పాటు రూ.700 కోట్లతో ఓఆర్ఆర్, ధర్వేశిపురం వరకు 6 లైన్ల రహదారి నిర్మిస్తామని తెలిపారు. అలాగే, ఏఎంఆర్పీ కాలువల లైనింగ్ కోసం రూ.450 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మంగారి గుట్ట - లతీఫ్ సాబ్ దర్గా గుట్టలను కూడా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా నల్లగొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్పొరేషన్ అభివృద్ధికి శాంతి, సామరస్యాలతో అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## మా గెలుపు ప్రజల విశ్వాసానికి నిదర్శనం: ఒవైసీ



హైదరాబాద్, జనవరి 17 (ఈవార్తలు): మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సంచలన విజయాలను నమోదు చేసింది. ఔరంగాబాద్, ముంబై, నాగ్‌పూర్ వంటి కీలక నగరాల్లో పార్టీ తన ఉనికిని బలంగా చాటుతూ, మొత్తం 125 మంది కార్పొరేటర్లను గెలిపించుకుంది. ఈ విజయంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ హర్షం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థులను గెలిపించినందుకు మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. మహారాష్ట్రలో తమ పార్టీకి వచ్చిన విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. ఓటమి ఎదుర్కొన్న పార్టీలు తమను నిందించకుండా తమ వైఫల్యాలపై ఆలోచించాలని హితవు పలికారు. పార్టీ గుర్తుపై గెలిచిన అభ్యర్థులు పార్టీతోనే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేసిన ఓవైసీ, తమ కార్పొరేటర్లను ఏకతాటిపై ఉంచేందుకు అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంఐఎం సిద్ధమవుతోందని, ఆసక్తి ఉన్న అభ్యర్థుల పేర్లను పార్టీ ఇప్పటికే కోరిందని తెలిపారు.

## బీఆర్ఎస్ ముక్కలవడం ఖాయం

**టీబీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు**



హైదరాబాద్, జనవరి 17 (ఈవార్తలు): రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చూపిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు ఐదు వేల సర్పంచ్ స్థానాల్లో పోటీ చేశామని, గతంతో పోలిస్తే బీజేపీ గెలుపు సంఖ్య పెరిగిందని చెప్పారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలపడుతోందనేందుకు స్పష్టమైన నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని... ఆ పార్టీ ముక్కలవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు గుప్పిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల రాజకీయాలకు పరిమితమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతోందని, అయినా కాంగ్రెస్ కేంద్ర పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## యూసుఫ్ గూడలో పేలిన వాషింగ్ మెషిన్

యూసుఫ్ గూడ/హైదరాబాద్, జనవరి 17 (ఈవార్తలు): హైదరాబాద్ లోని యూసుఫ్ గూడ పరిధిలో ఓ ఇంట్లో వాషింగ్ మెషిన్ పేలిపోయింది. తొలుత మెషిన్ నుంచి మంటలు వచ్చాయని, కాసేపటికే భారీ శబ్దంతో పేలుడు సంభవించిందని ఆ ఇంట్లో వాళ్లు చెప్పారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాషింగ్ మెషిన్ దగ్గర్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. మెషిన్ పేలుడుకు ఆ గదిలోని పలు వస్తువులు దెబ్బతిన్నాయని, వాషింగ్ మెషిన్ మొత్తం తుక్కుతుక్కుగా మారిందని వివరించారు. యూసుఫ్ గూడ పరిధిలోని కృష్ణానగర్ లో సయ్యద్ గౌస్ కు రెండు ఫ్లోర్ల బిల్డింగ్ ఉంది. సెకండ్ ఫ్లోర్ లోని పోర్షన్ ను అద్దెకు తీసుకున్న సాంబశివారెడ్డి అనే వ్యక్తి.. అందులో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ రోజు ఉదయం బట్టలు ఉతికేందుకు వాషింగ్ మెషిన్ ఆన్ చేయగా అందులో నుంచి మంటలు వచ్చాయి. కాసేపటికి పొగతోపాటు పెద్ద శబ్దంతో వాషింగ్ మెషిన్ పేలిపోయింది. వాషింగ్ మెషిన్ ముక్కలుముక్కలైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఈ దుర్ఘటనలో ఇల్లంతా చిందరవందర కాగా పలు వస్తువులు పాడైపోయాయి.



# బొట్ల జయ ప్రసాద్ కస్తూర్బా బాలిక పాఠశాల సందర్శన

మల్యాల, జనవరి 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాలలోని కస్తూర్బా బాలికల పాఠశాలను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్ సందర్శించారు. పాఠశాలలో వివిధ సమస్యలను పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకొన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో, వార్డ్ సభ్యులు మల్యాల గణేశ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం



జగిత్యాల టౌన్, జనవరి 17 (ఈవార్తలు): జగిత్యాలలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను కలచివేసింది. సంక్రాంతి సెలవుల కోసం స్వగ్రామానికి వచ్చిన యువకులు తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పోరండ్ల వద్ద పార్టీ ముగించుకుని కారులో తిరుగు ప్రయాణం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగం కారణంగా కారు అదుపు తప్పి ముందుగా విద్యుత్ స్తంభానికి ఢీకొని, అనంతరం డివైడర్‌ను మోదింది. ఈ ప్రమాదంలో నవనీత్, సాయి తేజ ఘటన స్థలంలోనే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో యువకుడు సృజన్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన పరిస్థితులపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో జగిత్యాలలో విషాద వాతావరణం నెలకొంది. అతివేగం, మద్యం మత్తుతో పాటు యువకుల నిర్లక్ష్యమే ప్రమాదానికి ప్రధాన కారణమని తెలిసింది.



# కాకినాడలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

**ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భూమిపూజ**

కాకినాడ, జనవరి 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, పర్యావరణహిత ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కాకినాడలో సుమారు రూ.18 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తుకు ఒక గేమ్ ఛేంజర్గా నిలవనుందని, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమగా ఇది చరిత్ర సృష్టించనుందని అన్నారు. భవిష్యత్తు మొత్తం గ్రీన్ ఎనర్జీదేనని, ఈ క్రమంలో గ్రీన్ అమ్మోనియా కీలక పాత్ర పోషించనుందని చంద్రబాబు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాతో మరో ముందడుగు వేస్తున్నాం. 2027 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది అని ఆయన ప్రకటించారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, కాలుష్యం కారణంగా సముద్ర జీవావరణంలో పెను మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సహజ వనరులు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎంతో అనుకూలమని ముఖ్యమంత్రి తెలిపారు. వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం, రానున్న 20 పోర్టులు, రాష్ట్రంలో పుష్కలంగా లభించే సౌర, పవన విద్యుత్ వనరులు మనకు వరమని పేర్కొన్నారు. సాంస్కృతిక విలువలను కాపాడుకుంటూనే, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా సొంత ఊరిని మర్చిపోకూడదని హితవు పలికారు. గొప్ప ఆలోచనలను ఆచరణలో పెట్టేవారు అరుదుగా ఉంటారని, అలాంటి వారిలో పారిశ్రామికవేత్త చలమలశెట్టి అనిల్ ఒకరని ప్రశంసించారు. గతంలో ఎన్టీఆర్ చొరవతోనే కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ పరిశ్రమ వచ్చిందని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఈ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుతో కాకినాడ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ఏ నిర్ణయాన్నైనా తక్షణమే అమలు చేస్తుందని స్పష్టం చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే నా ఆకాంక్ష. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రకృతి సేద్యం పెరగడమే మనందరి ఆరోగ్యానికి




శ్రీరామరక్ష అని అన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే వీలుంటుందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గొప్ప బలాన్ని ఇస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కాకినాడ ప్రాంతం ఒక కీలక పారిశ్రామిక, హరిత ఇంధన కేంద్రంగా అభివృద్ధి చెందనుంది.

**దేశ ఇంధన ప్రగతిలో మైలురాయి: జయప్రకాశ్ నారాయణ్**

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసిన గ్రీన్ కో సంస్థపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ ప్రశంసల వర్షం కురిపించారు. గ్రీన్ కో సంస్థకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ వివరాలను ఆయన ప్రస్తావిస్తూ, 1950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యంతో, 1.5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో ఏర్పాటైన ఈ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్.. భారతదేశ ఇంధన రంగ పరివర్తనలో, అధిక విలువైన రసాయనాల ఉత్పత్తిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, భారీ ప్రాజెక్టులే దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగలవని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు. ఇలాంటి ముందుచూపుతో కూడిన ఆవిష్కరణలు, పెట్టుబడులు వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంతో అవసరమని అన్నారు. దేశ ప్రగతి కోసం మరిన్ని ఇలాంటి ఆవిష్కరణలు, పెట్టుబడులు రావాలని ఆయన ఆకాంక్షించారు. గ్రీన్ కో చొరవ దేశానికి ఆదర్శమని కొనియాడారు.

# దాడిలో టీడీపీ కార్యకర్త మృతి

కాకినాడ, జనవరి 17 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రేపు ఆర్జిత సేవా డిప్

**ఏప్రిల్ నెల తిరుమల టికెట్ల ప్రకటన**

తిరుమల, జనవరి 17 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి దర్శనానికి ఏప్రిల్ నెలలో వెళ్లాలని భావిస్తున్న భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక ప్రకటన విడుదల చేసింది. 2026 ఏప్రిల్ నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసే తేదీల వారీ షెడ్యూల్‌ను శనివారం ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను ముందుగానే గమనించి, తమకు కావాల్సిన టికెట్లను అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించింది. తేదీల వారీగా విడుదల చేసే కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ముందుగా, అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవా టికెట్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ ప్రక్రియ జనవరి 19న ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సేవల కోసం భక్తులు జనవరి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు జనవరి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నిర్ణీత రుసుము చెల్లించి టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలతో పాటు శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల టికెట్ల కోటాను జనవరి 22న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో నేరుగా విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను కూడా భక్తులకు అందుబాటులో ఉంచుతారు. జనవరి 23వ తేదీన మూడు వేర్వేరు కోటాలను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. ఇక వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి సౌకర్యార్థం కేటాయించే ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ అధికారులు వివరించారు. భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను జనవరి 24న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అదేవిధంగా, తిరుమల,



తిరుపతిలలో బస చేసేందుకు అవసరమైన గదుల కోటాను కూడా అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. చివరగా, స్వామివారికి సేవ చేయాలనుకునే భక్తుల కోసం శ్రీవారి సేవ, పరకామణి సేవలకు సంబంధించిన కోటాను జనవరి 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అయితే, ఈ సేవా కోటా మార్చి నెలకు సంబంధించినదని భక్తులు గమనించాలని టీటీడీ స్పష్టం చేసింది.

# నేడు దావోస్‌కు చంద్రబాబు

**నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ**

అమరావతి, జనవరి 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏపీ సీఎం చంద్రబాబు ఆదివారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో పాల్గొనేందుకు ఆయన మంత్రులు, ఉన్నతాధికారుల బృందంతో కలిసి ఆదివారం బయల్దేరి వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మొత్తం 36 కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు. ఆదివారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి పయనం కానున్నారు. జనవరి 19న ఉదయం జ్యూరిచ్ చేరుకున్నాక, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, ఆయన బృందంతో భేటీ అవుతారు. పర్యటనలో తొలి ముఖ్య కార్యక్రమంగా, జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. సుమారు 20 దేశాల నుంచి హాజరయ్యే ప్రవాస తెలుగువారిని (ఎన్నారైలు) ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో దావోస్ చేరుకుంటారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే అంతర్జాతీయ



సమావేశంలో పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా సీఎంతో భేటీ కానున్నారు. ప్రముఖ విదేశీ మీడియా సంస్థ 'పొలిటికో'కు చంద్రబాబు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. పర్యటనలో రెండో రోజు అత్యంత కీలకంగా జరగనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే 'ఇండియా ఎట్ సెంటర్: జియోగ్రఫీ, గ్రోత్ – ఏపీ అడ్వాంటేజ్' అనే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఇండియా లాంజ్'ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత టెక్నాలజీ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఐబీఎం ఛైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అదే రోజు ఇజ్రాయెల్ ఆర్థిక, పారిశ్రామిక మంత్రి నిర్ బర్కత్‌తో, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మంత్రి హెలెన్ బడ్లిజెర్ అర్టిడాతోనూ చర్చలు జరుపుతారు. ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్‌మండ్‌తో పాటు, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ ఏపీ మోలర్–మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ముఖాముఖి సమావేశం కానున్నారు. జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి, 23వ తేదీ ఉదయం 8:25 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.



# 1,574 వంటకాలతో విందు

కోనసీమలో కొత్త అల్లుడికి అపూర్వ ఆతిథ్యం

కోనసీమ జిల్లా, జనవరి 17 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ వేళ కోనసీమలో ఓ కుటుంబం తమ కొత్త అల్లుడికి అపూర్వ రీతిలో ఆతిథ్యమిచ్చింది. ఏకంగా 1,574 రకాల వంటకాలతో భారీ విందు ఏర్పాటు చేసి గోదావరి జిల్లాల మర్యాదను మరోసారి చాటిచెప్పింది. ఈ ఘటన కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, ఆదుర్రు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదుర్రు గ్రామానికి చెందిన విజ్జెపు వెంకటరత్నం, సుశీల దంపతులు తమ కుమార్తె కీర్తిశ్రీని గత ఏడాది ఫిబ్రవరిలో పి. గన్నవరం మండలం ముంగండకు చెందిన సాయి శరత్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ సంక్రాంతి వారిద్దరికీ తొలి పండుగ కావడంతో, అల్లుడు సాయి శరత్ గురువారం అత్తవారింటికి వచ్చాడు. ఈ సందర్భంగా అల్లుడికి జీవితాంతం గుర్తుండిపోయేలా విందు ఇవ్వాలని భావించిన అత్తమామలు ఈ భారీ ఏర్పాట్లు చేశారు. ఈ విందులో సంప్రదాయ పిండివంటలు, స్వీట్లు, పండ్లు, శీతల పానీయాలు సహా మొత్తం 1,574 రకాల పదార్థాలను వడ్డించారు. అంతేకాకుండా, ఏడాదిలోని 12 నెలలకు ప్రతీకగా అల్లుడికి 12 ప్రత్యేక బహుమతులు కూడా అందించి తమ ప్రేమను చాటుకున్నారు. ఈ అసాధారణ ఆతిథ్యం చూసి అల్లుడితో పాటు అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఇటీవలే ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో ఓ కొత్తల్లుడికి 1,116 వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ఇప్పుడా రికార్డు బద్దలైంది. విశాఖలో ఓ కొత్త అల్లుడికి 290 వంటకాలతో విందు ఏర్పాటు చేయడం తెలిసిందే. తెనాలిలో మరో కొత్తల్లుడికి 158 రకాల వంటకాలతో విందు ఇచ్చారు.

# గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

విజయవాడ, జనవరి 17 (ఈవార్తలు): వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు న్యాయపరంగా తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఆయనపై విజయవాడలోని పోక్సో ప్రత్యేక కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిరంగంగా వెల్లడించారనే ఆరోపణలతో గోరంట్ల మాధవ్‌పై గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ ఫిర్యాదును మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చారు. ఈ కేసు విచారణకు రావాలంటూ కోర్టు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ గోరంట్ల మాధవ్ హాజరు కాకపోవడంతో, చివరకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయితే, తనపై జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను రీకాల్ చేయాలని కోరుతూ గోరంట్ల మాధవ్ సోమవారం కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసు తదుపరి విచారణలో ఏం జరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# ఆరోగ్య బీహార్

## మద్యనిషేధంతో మారిన ఆహారపు అలవాట్లు

### పెరిగిన ప్రొటీన్లు, ఆరోగ్యకర కొవ్వుల వినియోగం

### ఐఐటీ కాన్పూర్ ఆసక్తికర అధ్యయనం



*బీహార్‌లో 2016లో విధించిన సంపూర్ణ మద్యపాన నిషేధం ప్రజల ఆహారపు అలవాట్లపై సానుకూల ప్రభావం చూపిందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కాన్పూర్ పరిశోధకులు జరిపిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. నితీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేసిన ఈ నిషేధం వల్ల ప్రజలు మంచి తిండి తినడం మొదలుపెట్టారని గుర్తించారు.*

న్యూఢిల్లీ/పాట్నా: ప్రజల దైనందిన ఆహారంలో కేలరీలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వుల శాతం గణనీయంగా పెరిగినట్లు ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, పాల ఉత్పత్తులు, గింజల నుంచి తీసిన నూనెల వంటి పోషక విలువలున్న ఆహార పదార్థాల వాడకం పెరిగినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం కోసం నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ రెండు వేర్వేరు సమయాల్లో (2011-12, 2022-23) సేకరించిన వినియోగదారుల ఖర్చు డేటాను విశ్లేషించారు. కాలక్రమేణా వచ్చే మార్పులను, ప్రాంతీయ ఆర్థిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకునేందుకు, బీహార్‌ను పొరుగు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌తో పోల్చి పరిశీలించారు. ఫలితాల కచ్చితత్వాన్ని నిర్ధారించుకోవడానికి బహుళ గణాంక పద్ధతులను ఉపయోగించి, విస్తృతంగా తనిఖీలు చేశారు. మద్యపాన నిషేధం వల్ల కుటుంబాల్లో డబ్బు ఆదా అవ్వడమే కాకుండా, ఆ మొత్తాన్ని అనారోగ్యకరమైన వాటికి కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఖర్చు చేస్తున్నారని అధ్యయనం తేల్చింది. మద్యం కొనుగోలుకు దూరమవడం వల్ల ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్ ఫుడ్ వినియోగం కూడా గణనీయంగా తగ్గింది. సాధారణంగా మద్యంతో పాటు జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. "ఈ నిషేధం కేవలం కుటుంబ ఆర్థిక వనరులను ఆదా చేయడమే కాకుండా, ప్రవర్తనలోనూ సానుకూల మార్పులకు దారితీసింది. మద్యపానం తగ్గడం వల్ల కుటుంబ కలహాలు తగ్గాయి, ఇంట్లో స్థిరత్వం మెరుగుపడింది. పోషకాహారంపై ఖర్చు చేయడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు" అని ఐఐటీ కాన్పూర్ ఆర్థిక శాస్త్ర విభాగం పరిశోధకుడు వినాయక్ కృష్ణాత్రి వివరించారు. సాధారణంగా ధాన్యాల ఆధారిత ఆహారం ఎక్కువగా తీసుకునే బీహార్ లాంటి రాష్ట్రంలో ప్రోటీన్ల వినియోగం పెరగడం అనేది పాలసీపరంగా కీలకమైన విషయమని పరిశోధకులు పేర్కొన్నారు. చౌకగా లభించే అనారోగ్యకరమైన కొవ్వుల నుంచి నాణ్యమైన వంట నూనెల వైపు ప్రజలు మళ్లారని, ఇది వారి ఆహార నాణ్యతను మెరుగుపరిచిందని తెలిపారు. నిషేధం కఠినంగా అమలవుతున్న పట్టణ ప్రాంతాల్లో ఈ మార్పులు మరింత స్పష్టంగా కనిపించాయి. "ప్రధానంగా గృహ హింస, మద్యపాన సంబంధిత సామాజిక సమస్యలను తగ్గించే లక్ష్యంతో ఈ నిషేధాన్ని అమలు చేశారు. అయితే, ఇది అనుకోని విధంగా ప్రజలకు పోషకాహార, ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందించిందని మా అధ్యయనం చూపిస్తోంది" అని ఐఐటీ కాన్పూర్ అసోసియేట్ ప్రొఫెసర్ సుకుమార్ వెల్లక్కల్ తెలిపారు. మద్యంపై పెట్టే ఖర్చు ఆహారం వైపు మళ్లడం వల్ల ఆహార నాణ్యతలో అర్థవంతమైన మెరుగుదల కనిపించిందని ఆయన అన్నారు.

# మహిళల అందం వల్లే రేప్‌లు


కాంగ్రెస్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని భండేర్ కాంగ్రెస్ శాసనసభ్యుడు ఫూల్ సింగ్ బరయ్య మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అత్యాచారాలకు కులాన్ని అంటగడుతూ జుగుప్సాకర రీతిలో మాట్లాడారు. ఈ సమాజంలో కొన్ని కులాలు, వర్గాల మహిళలపై లైంగిక దాడి జరుగుతోందని ఆయన అన్నారు. వారితో లైంగిక వాంఛ తీర్చుకుంటే తీర్థయాత్రలకు వెళ్లిన పుణ్యం దక్కుతుందనే నమ్మకంతో ఇలా చేస్తారని, దీనికి సంబంధించి పుస్తకాల్లో కూడా ఉందని పేర్కొన్నారు. అందమైన అమ్మాయి కనిపిస్తే పురుషుడి మనస్సు చలించి అత్యాచారానికి పాల్పడే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కొన్ని వర్గాల మహిళలు అందంగా ఉండరని, కానీ ఫలానా వర్గానికి చెందిన మహిళతో కలిస్తే ఏదో లాభం ఉంటుందని ఆశించి అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డుపై నడుస్తుంటే అందమైన అమ్మాయిని చూస్తే అది అతడి మనసును మరల్చి, అత్యాచారానికి ప్రేరేపిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే ఫూల్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రంలో రాజకీయ దుమారం చెలరేగింది. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ, వివిధ కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సిద్ధాంతం ఇదేనా అని బీజేపీ ప్రశ్నించింది. ఆయన ఎలాంటి నీచబుద్ధితో ఉన్నారో ఈ వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోందని ఆల్ ఇండియా బ్రాహ్మణ పరిషత్ నేత పండిత్ పుష్పేంద్ర మిశ్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫూల్ సింగ్ బరయ్య వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతూ పట్వారి స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన వ్యాఖ్యలతో సంబంధం లేదని అన్నారు. అత్యాచారాన్ని ఏ విధంగానూ సమర్థించలేమని అన్నారు. అత్యాచారం చేసే వ్యక్తి ఎవరైనా కులం, మతంతో సంబంధం లేకుండా నేరస్థుడే అని ఆయన స్పష్టం చేశారు.

# సిక్కు హిందూ అమ్మాయిలే లక్ష్యం

## కిడ్నాప్.. సామూహిక అత్యాచారాలు.. యూకేలో పాకిస్థానీ గ్యాంగుల ఆగడాలు

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో పాకిస్థానీ మూలాలున్న వ్యక్తులు నడుపుతున్న గ్యాంగుల ఆగడాలు మరోసారి తీవ్ర కలకలం సృష్టించాయి. తాజాగా పశ్చిమ లండన్‌లోని హౌన్స్‌లో ప్రాంతంలో 15 ఏళ్ల సిక్కు బాలికను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. దశాబ్దాలుగా వ్యవస్థీకృతంగా చిన్నారులపై లైంగిక దోపిడీకి పాల్పడుతున్న ఈ ముఠాల నేరాలకు ఈ ఘటన అద్దం పడుతోంది. 'ది సండే గార్డియన్' తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, పాకిస్థానీ మూలాలున్న ఆరుగురు సభ్యుల ముఠా సదరు బాలికను కిడ్నాప్ చేసి, ఓ ఫ్లాట్‌లో నిర్బంధించింది. అక్కడ ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడింది. ఈ దారుణానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వ్యాపించడంతో ఈ విషయం బయటపడింది. దీంతో ఆగ్రహించిన సుమారు 300



మంది సిక్కులు నిందితుడి ఇంటి వద్ద ఆందోళనకు దిగి, పోలీసులతో ఘర్షణ పడ్డారు. పోలీసుల తీరుపై అసంతృప్తితో ఉన్న సిక్కు సమాజం ప్రతినిధులే స్వయంగా రంగంలోకి దిగి ఆ బాలికను రక్షించడం గమనార్హం. సాధారణంగా ఈ ముఠాలు 11 నుంచి 16 ఏళ్ల వయసున్న బలహీన వర్గాల అమ్మాయిలను, ముఖ్యంగా సిక్కు, హిందూ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటాయి. ప్రేమ, స్నేహం, బహుమతుల పేరుతో వారిని లోబరుచుకుని, ఆ తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తూ లైంగిక దోపిడీకి పాల్పడతాయి. గతంలో రోథర్‌హామ్, రోచ్‌డేల్ వంటి పట్టణాల్లో ఇలాంటి ఘటనలు సంచలనం సృష్టించాయి. 2014 అలెక్సిస్ జే నివేదిక ప్రకారం, ఒక్క రోథర్‌హామ్‌లోనే 1997-2013 మధ్య కనీసం 1,400 మంది చిన్నారులు లైంగిక దోపిడీకి గురయ్యారు. నిందితుల్లో అత్యధికులు పాకిస్థానీ మూలాల వారేనని నివేదిక తేల్చింది. జాతి వివక్ష ఆరోపణలు వస్తాయనే భయంతో అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని, ఇదే ఈ ముఠాల ఆగడాలకు కారణమని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

## మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ హతం

### తలపై కోటి రూపాయల రివార్డ్

బీజాపూర్: మావోయిస్టు పార్టీకి మరో కీలక ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ నేత పాపారావు అలియాస్ మోంగు ఉన్నాడు. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు వ్యూహకర్తగా పాపారావు వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో సీనియర్ నేతలు మృతి చెందిన తర్వాత మిగిలిన టాప్ లీడర్లలో ఒకరిగా పాపారావు కొనసాగుతున్నాడు.

# దేశ విభజన దురదృష్టకరం: సుధామూర్తి

బెంగళూరు: దేశ విభజన అనంతరం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు వలస వెళ్లిన వారి గురించి ఆలోచిస్తే ఎంతో బాధ కలుగుతుందని రాజ్యసభ సభ్యురాలు, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి అన్నారు. దేశ విభజన జరగడం దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని ఆమె అభిప్రాయపడ్డారు. జైపూర్ సాహిత్య వేడుకలో పాల్గొన్న సుధామూర్తి మాట్లాడుతూ, దేశ చరిత్రను, ముఖ్యంగా విభజనకు దారితీసిన పరిస్థితులను నేటి తరం పిల్లలు తప్పనిసరిగా అర్థం చేసుకోవాలని సూచించారు. చరిత్ర తెలియకపోతే భవిష్యత్తును అర్థం చేసుకోవడం కష్టమని ఆమె అన్నారు. దేశ విభజన నాటి పరిస్థితులను నేటి తరానికి తెలియజేయాలని చాలాసార్లు అనుకున్నానని ఆమె పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయం, భాషల గురించి ఏమీ తెలియని ఒక వ్యక్తి పెన్సిల్ తీసుకుని గీత గీసి సరిహద్దుల నిర్ణయించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు వలస వెళ్లిన వారి గురించి ఆలోచిస్తే



బాధగా ఉందని ఆమె అన్నారు. ఒకసారి తాను పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు విదేశీయురాలినని చెప్పి అక్కడి మ్యూజియంలో అధిక ఛార్జ్ వసూలు చేశారని, కానీ ఆ భూభాగం ఒకప్పుడు మన దేశంలో భాగమేనని గుర్తు చేశారు. సరిహద్దుల కారణంగా అది విదేశమైందన్న ఆలోచన తనను ఎంతగానో బాధించిందని ఆమె తెలిపారు. మనం ఇప్పుడు అనుభవిస్తున్న స్వేచ్ఛ మన పూర్వీకులు ఎంతో కష్టపడి సాధించారని ఆమె పేర్కొన్నారు. దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న తప్పుడు నిర్ణయం ఎన్నో తరాలపై ప్రభావం చూపుతోందని ఆమె అన్నారు.

# ఇండిగోకు 22.2 కోట్ల జరిమానా

## డిసెంబర్ సంక్షోభంపై డీజీసీఏ ఆగ్రహం

## సంస్థ అధికారులకు హెచ్చరికలు, ఒకరిపై వేటు

న్యూఢిల్లీ: ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగోపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రూ.22.20 కోట్ల భారీ జరిమానా విధించింది. గత ఏడాది డిసెంబర్‌లో వేలాది విమానాలను రద్దు చేయడం, ఆలస్యం చేయడంతో దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనపై ఈ కఠిన చర్యలు తీసుకుంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలతో డీజీసీఏ నలుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపింది. విమానాలు, సిబ్బందిని గరిష్టంగా వినియోగించుకోవడం (ఓవర్-ఆప్టిమైజేషన్), ప్రణాళిక సాఫ్ట్‌వేర్‌లో లోపాలు, యాజమాన్య పర్యవేక్షణ కొరవడటం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా దర్యాప్తులో తేలింది. కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఇండిగో విఫలమైందని కమిటీ స్పష్టం చేసింది. ఈ వైఫల్యాలకు గానూ డీజీసీఏ కఠిన చర్యలు చేపట్టింది. నిబంధనల ఉల్లంఘనలకు ఒకేసారి రూ.1.80 కోట్లు, 68 రోజుల పాటు నిబంధనలు పాటించనందుకు రోజుకు రూ.30 లక్షల చొప్పున మొత్తం రూ.20.40 కోట్లు కలిపి రూ.22.20 కోట్ల జరిమానా విధించింది. దీంతో పాటు, 'ఇండిగో సిస్టమిక్ రిఫార్మ్ అష్యూరెన్స్ స్కీమ్' కింద రూ.50 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాలని ఆదేశించింది. సంస్థ సీఈవో, సీఓఓలకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని ఆదేశించింది. అయితే, ఇండిగో వేగంగా కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకురావడాన్ని, రద్దయిన లేదా మూడు గంటల కంటే ఎక్కువ ఆలస్యమైన విమానాల్లోని ప్రయాణికులకు రూ.10,000 విలువైన వోచర్లు అందించడాన్ని డీజీసీఏ పరిగణనలోకి తీసుకుంది.




# బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్యకు గురయ్యాడు. గత మూడు వారాల్లోనే బంగ్లాదేశ్‌లో పది మందికి పైగా హిందువులు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా, పెట్రోల్ పంపులో ఇంధనం నింపుకుని డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు హిందూ వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ విషాద సంఘటన రాజ్‌బరి జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. అతడు అక్కడి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడని పోలీసులు వెల్లడించినట్లు అక్కడి మీడియా వర్గాలు తెలిపాయి. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ నింపుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండానే వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో రిపోన్ అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, హాషేమ్ తన కారును అతనిపైకి పోనిచ్చాడు. తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాషేమ్, అతడి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# హెచ్‌డీఎఫ్‌సీ లాభాల జోరు

ముంబై: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బలమైన పనితీరు కనబరిచింది. డిసెంబర్‌తో ముగిసిన ఈ త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 12.17 శాతం పెరిగి రూ.19,806.63 కోట్లకు చేరినట్లు శనివారం ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.17,656.61 కోట్లుగా ఉంది. బ్యాంక్ కీలక ఆదాయమైన నికర వడ్డీ ఆదాయం కూడా 6.4 శాతం పెరిగి రూ.32,615 కోట్లకు చేరుకుంది. ఆస్తుల నాణ్యత విషయంలో బ్యాంక్ పనితీరు మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత ఏడాదితో పోలిస్తే 1.42 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పీఏల నిష్పత్తి కూడా 0.46 శాతం నుంచి 0.42 శాతానికి మెరుగుపడింది. ఈ త్రైమాసికంలో కేటాయింపులు (ప్రొవిజన్స్) 10 శాతం తగ్గి రూ.2,837.9 కోట్లకు పరిమితం కావడం లాభాల పెరుగుదలకు దోహదపడింది. 2025 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 12.2 శాతం వృద్ధితో రూ.27,524 బిలియన్లకు, ఇచ్చిన రుణాలు (అడ్వాన్సులు) 11.9 శాతం వృద్ధితో రూ.28,446 బిలియన్లకు చేరాయని బ్యాంక్ తన ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. మొత్తం మీద ఆదాయం, లాభాలతో పాటు కీలక వ్యాపార కార్యకలాపాల్లోనూ బ్యాంక్ స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది.

# బెంగాల్‌కు టైమైంది

### మమత ప్రభుత్వం విఫలం

### ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

### ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

కోల్‌కతా: బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

# పురుషులకూ ఫ్రీ బస్

### ఎన్నికల హామీలను ప్రకటించిన అన్నాడీఎంకే

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి అన్నాడీఎంకే ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ 109వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి... ఐదు ప్రధాన హామీలను ప్రకటించారు. వీటిలో పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం, ప్రతి కుటుంబ మహిళకు నెలకు రూ. 2,000 జమ చేసే 'మగళీర్ కులవిళక్కు' పథకం, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు మరియు పట్టణాల్లో అపార్ట్ మెంట్ల పంపిణీ, ఎస్సీ జంటలకు ప్రత్యేక ఇళ్ల స్థలాల కేటాయింపు, అలాగే 5 లక్షల మహిళలకు ద్విచక్ర వాహనాల కొరకు రూ. 25,000 సబ్సిడీగా 'అమ్మ టూ వీలర్ స్కీమ్లు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను డీఎంకే కాపీ కొట్టిందని పళనిస్వామి విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నడిపినట్లు చెప్పారు. కరోనా సమయంలో కూడా ప్రజలకు అన్ని పథకాలను సక్రమంగా అందించామని తెలిపారు.

# అమెరికాకు భారత్ కావాలి

### రిపబ్లికన్ పార్టీ నేత కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్‌లతో అమెరికా సంబంధాలపై ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, రిపబ్లికన్ పార్టీ నేత రిచ్ మెక్‌కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా.. పాకిస్థాన్‌తో కంటే భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. అమెరికాకు పెట్టుబడులను తీసుకొచ్చేది భారత్ తప్ప పాకిస్థాన్ కాదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రతిభావంతులైన నిపుణులను, ఉద్యోగులను భారత్ అమెరికాకు పంపిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమెరికా అభివృద్ధిలో భారతదేశం, అక్కడి నిపుణులు, ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తాయని అన్నారు. భారత్‌ను అమెరికా దూరం చేసుకోకూడదని, ఒకవేళ అదే జరిగితే అమెరికాకే నష్టమని ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికను భారత్ లెక్కచేయడం లేదని, ఇది అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైందని ఆయన అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని ట్రంప్ హెచ్చరించినప్పటికీ భారత్ మాత్రం కొనుగోళ్లను ఆపడం లేదని గుర్తు చేశారు. ఇది నచ్చని ట్రంప్, భారత్ పట్ల కఠిన వైఖరిని అవలంభిస్తున్నారని వ్యాఖ్యానించారు. కానీ భారతదేశం ప్రయోజనాల గురించి ఆలోచించిన ప్రధాని నరేంద్ర మోదీ ఎవరి మాటను లెక్క చేయకుండా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.



## వయ్యారి చిత్రం


రకుల్ ప్రీత్ సింగ్



## టీనేజీ హీరోయిన్స్‌పై లైంగిక దోపిడీ: జోడీ ఫోస్టర్

హాలీవుడ్ సీనియర్ నటి, ఆస్కార్ విజేత జోడీ ఫోస్టర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. సినిమా పరిశ్రమలో టీనేజ్ నటీమణుల విషయంలో జరుగుతున్న లైంగిక దోపిడీ, వేధింపుల గురించి పెద్ద ఎత్తున చర్చకు తెరతీసాయి. ఎన్.పి.ఆర్ ఫ్రెష్ ఎయిర్ ఇంటర్వ్యూలో సీనియర్ నటి తన టీనేజీ వయసులో, కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న విపత్కర పరిస్థితుల గురించి, ప్రస్తుత తరం నటీమణుల గురించి సంచలన విషయాలు మాట్లాడారు. జోడీ ఫోస్టర్ తన 12 ఏళ్ల వయసులో టాక్సీ డ్రైవర్ సినిమాలో నటించి చిన్న వయసులోనే ఆస్కార్ నామినేషన్ పొందారు. వెటరన్ స్టార్ జోడీ ఫోస్టర్ మాట్లాడుతూ–"నాకు ఆ వయసులోనే ఆస్కార్ నామినేషన్ రావడం వల్ల పరిశ్రమలో ఒక రకమైన పవర్ లభించింది. నేను ఎవరి కెరీర్‌నైనా నాశనం చేయగలనని లేదా ఫిర్యాదు చేయగలనని భయపడి, వేటాడే ప్రిడేటర్స్ నన్ను తాకడానికి భయపడేవారు!" అని పేర్కొన్నారు. ఆ పవర్ లేకపోతే తను కూడా తన తోటి నటీమణులలాగే వేధింపులకు గురయ్యేదాన్ని అని విశ్లేషించారు. టీనేజ్ నటీమణులను కేవలం ఒక వస్తువుగా చూసే విధానంపై జోడీ ఫోస్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార సమతుల్యత పరిశ్రమలో వేధింపులకు కారణమవుతున్నాయని అన్నారు. అధికారంతో వేధింపులు కేవలం శృంగారపరమైనవి కావని, అవి అధికారం అనే దందాను ప్రదర్శించడమేనని వ్యాఖ్యానించారు. బలహీనంగా ఉన్నవారిని ముఖ్యంగా చిన్న పిల్లలను లొంగదీసుకోవడం క్రూరమైన చర్యగా అభివర్ణించారు. నేటి తరం చైల్డ్ ఆర్టిస్టుల గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ వీరి తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారు? రెడ్ కార్పెట్ మీద చిన్న వయసులోనే మద్యం తాగుతూ కనిపిస్తుంటే ఎవరూ ఎందుకు ఆపడం లేదు? అని ప్రశ్నించారు. నటన అనేది ఒక క్రూరమైన వృత్తి అని, తన వ్యక్తిత్వానికి ఇది సరిపోదని తెలిసినప్పటికీ, పరిస్థితులు తనను ఇక్కడికి తీసుకొచ్చాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## యుఫోరియా' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ గుణశేఖర్ తెరకెక్కిస్తున్న కొత్త సినిమా 'యుఫోరియా'. దురంధర్ మూవీ ఫేమ్ సారా అర్జున్ ప్రధాన పాత్రలో వస్తున్న ఈ సినిమాలో భూమిక చావ్లా, గౌతమ్ మీనన్, నాజర్, ఆదర్శ్ బాలకృష్ణ తదితరులు ప్రధాన పాత్రలో నటించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశాడు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించినఅబశ్రీశ్రీ ఒక భారీ ఈవెంట్‌లో ఈ కార్యక్రమం ఘనంగా జరిగిందిప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్ వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, క్రైమ్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించాడు దర్శకుడు గుణశేఖర్. ట్రైలర్ లో ఆ ఎలిమెంట్స్ ను ఎక్కువగా చూపించారు. ఇవన్నీ చూస్తుంటే ఈ సినిమా చాలా ఇంటెన్స్ గా ఉండనుందని క్లియర్ గా అర్థమవుతోంది. అమ్మాయిలపై రేప్ అటెంప్ట్స్, మైనర్ క్రైమ్స్, పోక్సో ఇలా చాలా కరెంట్ టాపిక్స్ ను తీసుకున్నారు. వాటి తాలూకు షాట్స్ కూడా చాలా బాగా సెట్ చేశారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఇక ఈ ఒక్క ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక రేంజ్ లో పెంచేసింది. దాదాపు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్నట్టుగా మేకర్స్ ప్రకటించారు. ఇక గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ సినిమాకు కాలభైరవ మ్యూజిక్ అందిస్తున్నాడు. మరి శాకుంతలం లాంటి పాన్ ఇండియా డిజాస్టర్ తరువాత గుణశేఖర్ నుంచి వస్తున్న ఈ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది అనేది చూడాలి.




## పెళ్లి ఫన్నీ రూమర్ అట!

గత కొద్ది రోజులుగా కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ మధ్య ఏదో ఉందనే ప్రచారం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఊహాగానాలు కేవలం డేటింగ్ దగ్గరే ఆగకుండా ఏకంగా పెళ్లి వరకు వెళ్లడం విశేషం. ముఖ్యంగా రాబోయే వాలెంటైన్స్ డే నాడు వీరిద్దరూ రహస్యంగా వివాహం చేసుకోబోతున్నారనే పోస్ట్‌లు నెట్టింట హల్చల్ చేశాయి. కేవలం సన్నిహితులు, అతి తక్కువ మంది స్నేహితుల మధ్యే ఈ వేడుక జరగబోతోందని ప్రచారం సాగింది. ధనుష్ సోదరీమణులను మృణాల్ సోషల్ మీడియాలో ఫాలో అవ్వడం వంటి అంశాలు ఈ రూమర్లకు మరింత బలాన్నిచ్చాయి. అయితే ఈ వార్తల్లో ఎంతవరకు వాస్తవం ఉందనే విషయంపై ఇప్పటివరకు ఎవరూ స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఒక క్లారిటీ వచ్చింది. ధనుష్ మృణాల్ ఠాకూర్ టీమ్స్ ను ఇటీవల ప్రముఖ మీడియా సంస్థ సంప్రదించి ఈ పెళ్లి వార్తలపై వివరణ కోరింది. వారు ఇచ్చిన సమాధానంతో ఈ వైరల్ వార్తలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. బాలీవుడ్ ప్రముఖ మీడియా సంప్రదించగా, ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే వార్తలు కేవలం ఒక జోక్ అని వారి పబ్లిసిస్ట్ టీమ్స్ కొట్టిపారేశాయి. వాస్తవానికి అలాంటిదేమీ లేదని, ప్రస్తుతం వస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని వారు స్పష్టం చేశారు.





## తమన్నా ఐటెం సాంగ్ రికార్డు

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తన గ్లామర్, డ్యాన్సులతో అందరినీ షేక్ చేసిన సాంగ్ ఆజ్ కీ రాత్. 2024లో బాలీవుడ్ లో వచ్చిన స్త్రీ2 సినిమా బ్లాక్ బస్టర్ గా నిలవడానికి ఈ పాట కూడా ఒక కారణం. సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో మోత మోగించిన ఈ సాంగ్, ఇప్పుడు యూట్యూబ్ లో ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. తాజాగా ఆజ్ కీ రాత్ వీడియో సాంగ్ 100 కోట్ల వ్యూస్ ను క్రాస్ చేసింది. ఆజ్ కీ రాత్ సాంగ్ అరుదైన రికార్డును అందుకున్న కారణంగా తమన్నా సోషల్ మీడియాలో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తన ఆనందాన్ని తెలియచేస్తూ తమన్నా ఓ వీడియోను పోస్ట్ చేయగా, ఆ వీడియోలో సాంగ్ షూటింగ్ నాటి బిహైండ్ సీన్స్ క్లిప్స్ ను షేర్ చేశారు. ఈ సాంగ్ ఫస్ట్ వ్యూ నుంచి 1 బిలియన్ వ్యూస్ వరకు ఎంతో ప్రేమను కురిపించినందుకు తమన్నా అందరికీ థ్యాంక్స్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు.

## అందుకే బాలీవుడ్‌కు శ్రీలీల!



ఉన్న పళంగా శ్రీలీల బాలీవుడ్ కి ఎందుకు వెళ్లింది? అవకాశాలు వచ్చినా, తీసుకున్న అడ్వాన్సులు కూడా వెనక్కి ఇచ్చేసి మరీ హిందీ సినిమాల వైపు మళ్లింది? అమ్మడిలో ఈ సడెన్ ఛేంజ్ చూసి అభిమానులు సహా ప్రేక్షకులు షాక్ అయ్యారు. తెలుగు అవకాశాలను వదులకుని బంగారంలాంటి భవిష్యత్ ను నాశనం చేసుకుంటుందనే ఊహగానాలు వ్యక్తమయ్యాయి. దీనికి కారణంగా బాలీ వుడ్ లో స్థిరపడాలి...భవిష్యత్ ని అక్కడే నిర్దేశించుకుని ముందుకు సాగుతుందని అతా అనుకున్నారు. కానీ అసలు కారణం అది కాదు. తెలుగు సినిమాల్లో నటిస్తే తనకు ప్యూచరే ఉండదని అమ్మడు ముందుగానే గెస్ చేసి బాలీవుడ్ కి వెళ్లినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే టాలీవుడ్ లో శ్రీలీల ఇంకా పూర్తి స్థాయిలో హీరోయిన్ గా స్థిరపడలేదు. కెరీర్ ని ఇంకా నిర్మించుకునే ప్రయత్నాల్లోనే ఉంది. కొన్ని సినిమాల్లో హీరోయిన్ గా నటించిన ఆ పాత్రాలు తనలో మాస్ కోణాన్ని హైలైట్ చేసాయి తప్ప హీరోయిన్గా ఐడెంటిటీని తీసుకురాలేదన్నది కాదనలేని నిజం. అదే సమయంలో ఐటం పాటల్లో కూడా నటించింది.



## కల్యాణి ప్రియదర్శన్ కోసం రంగంలోకి రణవీర్

దురంధర్ చిత్రంతో రికార్డులు బ్రేక్ చేస్తున్న రణ్ వీర్ సింగ్ రెట్టించిన ఉత్సాహంతో కెరీర్ లో ప్రయోగాలకు సిద్ధమవుతున్నాడు. తదుపరి దురంధర్ సీక్వెల్ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం చాలా కొత్త రికార్డులను నెలకొల్పుతూ ఇండియాలో చాలామంది పాన్ ఇండియా హీరోలకు సవాల్ విసురుతుందని అంచనా వేస్తున్నారు. 2025 ముగింపును ఘనంగా కానిచ్చేసిన రణ్ వీర్ ఫర్హాన్ దర్శకత్వంలోని డాన్ 3 ఆఫర్ ని వదులుకోవడం ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో జాంబీ మూవీ తెరపైకొచ్చింది. 2025లో మలయాళ చిత్రసీమలో సెన్సేషన్ గా మారింది కళ్యాణి ప్రియదర్శిణి. తన స్నేహితుడు దుల్కార్ సల్మాన్ నిర్మించిన లోకా– ది చాప్టర్ 1 సంచలన విజయం సాధించి, పాన్ ఇండియాలో హాట్ టాపిగ్గా మారింది. ఇలాంటి సమయంలో రణ్ వీర్ తన తదుపరి చిత్రానికి కళ్యాణి ప్రియదర్శినిని కథానాయికగా ఎంపిక చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్.. సౌత్ ఇండియా సెన్సేషన్ కళ్యాణి ప్రియదర్శన్ కాంబినేషన్‌లో భారతదేశంలో నెవ్వర్ బిఫోర్ అనిపించేలా జాంబీ థ్రిల్లర్ ప్రళయ్ తెరకెక్కుతుందని చర్చ సాగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ తన బాలీవుడ్ అరంగేట్రం విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని కూడా తెలుస్తోంది. తన తండ్రి ప్రియదర్శన్ బాలీవుడ్‌లో దిగ్గజ దర్శకుడు అయినా కళ్యాణి మాత్రం సరైన కథ కోసం ఎదురుచూసారు. ముఖ్యంగా జాంబీ థ్రిల్లర్ లాంటి భిన్నమైన జోనర్‌లో హిందీ కి పరిచయం కావడం తనకు కొంచెం సందేహంగా అనిపించిందట. దీంతో రణవీర్ సింగ్ స్వయంగా రంగంలోకి దిగి కళ్యాణికి ఫోన్ చేసి మాట్లాడినట్లు సమాచారం.



# ఆర్సీబీ మ్యాచ్‌లు చిన్నస్వామిలోనే!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అభిమానులకు గుడ్ న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్( కేసీఎస్‌సీఏ) శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 'అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌కు హోం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలియజేయడానికి మేం సంతోషిస్తున్నాం.'అని కేసీఎస్‌సీఏ పేర్కొంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగా మ్యాచ్‌లు నిర్వహిస్తామని తెలిపింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవగా.. మరుసటి రోజే బెంళూరులో ఆ ఫ్రాంచైజీ నిర్వహించిన విజయోత్సవ వేడుక విషాదంగా ముగిసిన సంగతి తెలిసిందే. 18 ఏళ్ల తర్వాత ఆర్‌సీబీ టైటిల్ గెలవడంతో పెద్ద ఎత్తున అభిమానులు ఈ విజయోత్సవ వేడుకలో భాగమయ్యారు. అభిమానుల రాకను అంచనా వేయడంలో ఫ్రాంచైజీ, పోలీసు అధికారులు విఫలమయ్యారు. దాంతో చిన్న స్వేమి స్టేడియం బయట తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. భారత క్రికెట్ చరిత్రలోనే ఈ ఘటన ఓ మాయని మచ్చగా మారిపోయింది. ఆర్‌సీబీ ఫ్రాంచైజీతో పాటు కర్ణాటక ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే కర్ణాటక ప్రభుత్వం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి కున్హా నేతృత్వంలో జ్యుడిషయల్ కమిషన్ వేసింది. తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపిన కమిషన్.. చిన్న స్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని తేల్చింది. దాంతోనే మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లతో పాటు దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లను మరో వేదికకు తరలించారు. ఆర్‌సీబీ కూడా తమ హోమ్ గ్రౌండ్‌ను మార్చుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ నిర్ణయంపై కర్ణాటక వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. దాంతో తలొగ్గిన కర్ణాటక ప్రభుత్వం.. కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.




## యువీ, లారా నా ఫేవరెట్: వైభవ్ సూర్యవంశీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన ఫేవరెట్ క్రికెటర్ ఎవరో చెప్పాడు. టీమిండియా క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల పేర్లు కాకుండా ఇతర పేర్లు చెప్పడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా ఒకరి పేరు కాకుండా ఈ 14 ఏళ్ల కుర్రాడు ఇద్దరు ఆటగాళ్లు తన ఆల్‌టైమ్ ఫేవరెట్ అని పేర్కొన్నాడు. ఇందులో ఒకరు భారత ఆటగాడు ఉండగా.. మరొకరు విదేశీ ప్లేయర్ ఉన్నాడు. ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని వెల్లడించాడు. టోర్నీ నిబంధనల ప్రకారం ప్రతీ ప్లేయర్ తమను తాము పరిచయం చేసుకోవాల్సి ఉంటుంది. తమ బ్యాటింగ్, బౌలింగ్ శైలితో పాటు ఫేవరెట్ క్రికెటర్ల పేరు చెప్పాలి. అంతేకాకుండా బ్యాటర్లు అయితే తమ ఫేవరెట్ షాట్, బౌలర్లు అయితే తమ ఫేవరెట్ బాల్ ఏంటో తెలియజేయాలి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రతీ మ్యాచ్‌లో ప్లే చేస్తుంటారు. బ్యాటింగ్‌కు వచ్చిన తర్వాత బ్యాటర్ల వీడియోలు.. బౌలింగ్ చేస్తున్న బౌలర్ల వీడియోలను చూపిస్తారు. ఈ క్రమంలోనే వైభవ్ సూర్యవంశీ తన ఫేవరెట్ ప్లేయర్ల పేర్లు వెల్లడించాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా తమ ఆల్‌టైమ్ ఫేవరెట్ క్రికెటర్లు అని చెప్పుకొచ్చాడు. తనకు పుల్ షాట్ అంటే చాలా ఇష్టమని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. జనవరి 15(గురువారం)న ప్రారంభమైన అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్.. తమ తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(2) విఫలమైనా.. భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ద్వారా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అండర్ 19 ప్రపంచకప్ ఆడిన అతి పిన్న భారత ప్లేయర్‌గా నిలిచాడు. 14 ఏళ్ల 294 రోజుల వయసులో వైభవ్ సూర్యవంశీ అండర్ 19 ప్రపంచకప్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో కుమార్ కుశాగ్ర రికార్డ్‌ను అధిగమించాడు. అతను 15 ఏళ్ల 88 రోజుల వయసులో అండర్ 19 ప్రపంచకప్ ఆడాడు. 2020లో జరిగిన టోర్నీలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. తాజాగా ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు.

## నితీశ్ ఆల్‌రౌండర్ కాదు

టీమిండియా మేనేజ్‌మెంట్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ మరోసారి విమర్శలు గుప్పించాడు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఏ ప్రాతిపదికన భారత జట్టును ఎంపిక చేశారో తనకు అర్థం కావడం లేదన్నాడు. జట్టులో ఆంధ్ర ప్లేయర్ అయిన నితీష్ కుమార్ రెడ్డి పాత్ర ఏంటని ప్రశ్నించాడు. అతను అసలు ఆల్‌రౌండరే కాదని స్పష్టం చేశాడు. నితీష్ కుమార్ రెడ్డిని పార్ట్‌టైమ్ బౌలర్ అనాలని సూచించాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ ఒక మ్యాచ్ గెలిచి, మరో మ్యాచ్ ఓడిన సంగతి తెలిసిందే. దాంతో ఆదివారం జరిగే మూడో వన్డే సిరీస్ డిసైడర్‌గా మారింది. భారత బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. మూడో వన్డే నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన మహమ్మద్ కైఫ్ భారత జట్టు ఎంపిక తీరును తప్పుబట్టాడు. 'న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టు నాకు అస్సలు అర్థం కావడం లేదు. పిచ్ స్లోగా ఉన్న రాజ్‌కోట్‌లో నలుగురు పేసర్లతో బరిలోకి దిగారు. కానీ న్యూజిలాండ్ మాత్రం ముగ్గురు స్పిన్నర్లతోనే ఆడింది. న్యూజిలాండ్ ఇక్కడి పరిస్థితులను బాగా అర్థం చేసుకుంది.



## సూర్యవంశీ.. కోహ్లీ రికార్డు బ్రేక్



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. యూత్ వన్డే క్రికెట్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డ్‌ను అధిగమించాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ.. 67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలతో 72 పరుగులు చేశాడు. దాంతో యూత్ వన్డేల్లో కోహ్లీని వైభవ్ సూర్యవంశీ అధిగమించాడు. 2006 నుంచి 2008 మధ్య 28 యూత్ వన్డేలు ఆడిన కోహ్లీ.. 978 పరుగులు చేసాడు. వైభవ్ సూర్యవంశీ 19 యూత్ వన్డేల్లోనే 3 సెంచరీలు, ఐదు హాఫ్ సెంచరీలతో 1047 పరుగులు చేశాడు. 2024లో భారత్ తరఫున అండర్ 19 క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన సూర్యవంశీ.. దుమ్మురేపుతున్నాడు. శుభ్‌మన్ గిల్, ఉన్ముక్త్ చంద్‌లను అధిగమించే దిశగా సూర్యవంశీ దూసుకెళ్తున్నాడు. 2018 అండర్ 19 ప్రపంచకప్‌లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన శుభ్‌మన్ గిల్.. మొత్తం 15 యూత్ వన్డేల్లో 1149 పరుగులు చేశాడు. 2012 అండర్ 19 ప్రపంచకప్ విన్నర్ ఉన్ముక్త్ చంద్ 21 ఇన్నింగ్స్‌ల్లో 1149 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్లో ఉన్ముక్త్ అజేయ శతకంతో రాణించాడు. ఎందుకంటే బీసీసీఐ రూల్స్ ప్రకారం ఒక ప్లేయర్ ఒక డర్ 19 ప్రపంచకప్ ఎడిషన్ మాత్రమే ఆడాలి. భారత దేశవాళీ క్రికెట్‌లో బిహార్‌కు ఆడుతున్న సూర్యవంశీ.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. తన విధ్వంసకర ఆట తీరుతో తుది జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.

**యూత్ వన్డేల్లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్లు:**

**విజయ్ జోల్ 1404, యశస్వి జైస్వాల్ 1386**
**తన్మయ్ శ్రీవాస్తవ 1316, శుభ్‌మన్ గిల్ 1149**
**ఉన్ముక్త్ చంద్ 1149**

# ముంబై చిత్తు

### సమష్టిగా విఫలం

### యూపీ కెప్టెన్ బ్యాటింగ్ విధ్వంసం

### ముంబై ఆడిన ఐదింటిలో 3 ఓటమి



వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు మరో ఘోర పరాజయం ఎదురైంది. యూపీ వారియర్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. యూపీ కెప్టెన్ మెగ్‌లాన్నింగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. మెగ్ లాన్నింగ్(45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సలతో 70), ఫోబె లిట్చ్‌ఫీల్డ్(37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సలతో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. ముంబై బౌలర్లలో నాట్ సివర్ బ్రంట్ రెండు వికెట్లు తీయగా.. అమెలియా కేర్ మూడు వికెట్లు పడగొట్టింది. నికోలా కేరీ, హీలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్ తలో వికెట్ తీసారు. అనంతరం ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసి ఓటమిపాలైంది. అమెలియా కేర్(28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్(24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 41 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లో శిఖా పాండే(2/30) రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, సోఫీ ఎక్లేస్టోన్, దీప్తి శర్మ, చోలే ట్రయాన్ తలో వికెట్ తీసారు. లక్ష్యచేధనలో ముంబై బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు హీలీ మాథ్యూస్(13), సజీవన్ సజన(10) నిరాశపర్చారు. దాంతో ముంబై పవర్ ప్లేలో 2 వికెట్లకు 38 పరుగులే చేసింది. ఆ వెంటనే నాట్ సివర్ బ్రంట్‌ను శిఖా పాండే పెవిలియన్ చేర్చింది. నికోలా కేరిని దీప్తి శర్మ ఔట్ చేయగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(18) ట్రయన్ వెనక్కి పంపింది. దాంతో ముంబై 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో అమెలియా కేర్, అమన్‌జోత్ కౌర్ పోరాడారు. కానీ ఛేజింగ్ రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ముంబైకి ఇది మూడో పరాజయం. రెండు సార్లు యూపీ వారియర్స్ చేతిలోనే ఓడటం గమనార్హం.




## ఉజ్జయినిలో కోహ్లీ, కుల్దీప్ పూజలు

టీమిండియా క్రికెటర్లు కొందరు ఇవాళ ఉజ్జయిని మహాకాలేశ్వరుడి సేవలో పాల్గొన్నారు. బోలేనాథుడికి నిర్వహించే భస్మ హారతిలో పాల్గొన్నారు. మేటి బ్యాటర్ విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు మరికొంత మంది క్రికెటర్లు మహాశివుడి దర్శనం చేసుకున్నారు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ కూడా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడుతున్న కోహ్లీ.. ఇండోర్‌లో ఆదివారం జరగనున్న మూడవ వన్డే కోసం రెఢీ అయ్యాడు. అయితే ఇవాళ ఉదయం 4 గంటలకు కొందరు క్రికెటర్లు మహాకాలేశ్వరుడి సన్నిధానికి విచ్చేశారు. నంది హాల్‌లో కూర్చున్న క్రికెటర్లకు పూజారులు తిలకం దిద్దారు. సుమారు రెండు గంటలకు పైగా కోహ్లీ, కుల్దీప్ భస్మ హారతిలో పాల్గొన్నారు. ఆ క్రికెటర్లకు నుదుటిపై పూజారుల గంధం పూశారు. టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్, వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా మహాకాలేశ్వరుడి ఆశీస్సులు తీసుకున్నారు. జై శ్రీ మహాకాల్ అంటూ విరాట్ కోహ్లీ అన్నారు. మహాకాల్ ఆలయానికి రావడం సంతోషాన్ని ఇచ్చినట్లు కుల్దీప్ చెప్పాడు. టీ20 వరల్డ్‌కప్‌లో రాణించే విధంగా ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపాడు.




ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 18-1-2026



# 'మహా' తీర్పు.. మారని ప్రతిపక్షం!

ప్రజాస్వామ్యంలో ఓటరు నాడీని పట్టుకోవడంలో విఫలమైతే ఎంతటి బలమైన రాజకీయ శక్తులైనా నేలమట్టం కావాల్సిందేనని మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయి. దేశ రాజకీయాల్లో కీలకమైన మహారాష్ట్రలో స్థానిక పోరు ఫలితాలు ప్రతిపక్ష కూటమికి ఒక రకంగా చెంపపెట్టు వంటివనే చెప్పాలి. అభివృద్ధి మంత్రం, క్షేత్రస్థాయి వ్యూహాల ముందు కేవలం విమర్శలు, భావోద్వేగ రాజకీయాలు పనిచేయవని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. ఇకనైనా ప్రజల నాడీని తెలుసుకుని మసలుకోకపోతే, భవిష్యత్తులో విపక్షాల ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ఎన్నికలకు ముందు అధికార పక్షంపై వ్యతిరేకత ఉందని, స్థానిక సమస్యలు తమకు కలిసి వస్తాయని ప్రతిపక్షాలు భారీ ఆశలు పెట్టుకున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన, ముఖ్యంగా మున్సిపల్ పరిధుల్లో జరిగిన అభివృద్ధి పనుల వైపు ఓటరు మొగ్గు చూపారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లకపోవడమే కాకుండా, వాటిలో స్పష్టత కరువైందని ఫలితాలు చెబుతున్నాయి. ప్రతిపక్షాల ఓటమికి ప్రధాన కారణం వాటి మధ్య సమన్వయ లోపం. అగ్రనేతల మధ్య సయోధ్య ఉన్నట్లు పైకి కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో కార్యకర్తల మధ్య ఐక్యత కనిపించలేదు. అభ్యర్థుల ఎంపికలో జాప్యం, రెబెల్స్ బెడద విపక్షాల కొంపముంచాయి. అధికారం కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి చేస్తున్న ప్రయోగాలు ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఓటర్లు స్థిరమైన నాయకత్వాన్ని, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళికను కోరుకుంటున్నారనే విషయాన్ని విపక్షాలు విస్మరించాయి. ప్రస్తుత ఓటరు చాలా చైతన్యవంతుడు. కేవలం విమర్శలకే పరిమితమయ్యే పార్టీలను కాకుండా, తమ దైనందిన జీవితాల్లో మార్పు తెచ్చే వారికే పట్టం కడుతున్నాడు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలను ప్రతిపక్షాలు ప్రస్తావించినప్పటికీ, వాటికి తాము అధికారంలోకి వస్తే చూపే పరిష్కార మార్గాలేమిటో స్పష్టంగా చెప్పలేకపోయాయి. ఫలితంగా, ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూడకుండా ప్రస్తుత పాలనకే మొగ్గు చూపారు. ఈ ఓటమి విపక్షాలకు ఒక పాఠం కావాలి. ప్రజల నాడీని పట్టుకోవడంలో తాము ఎక్కడ విఫలమయ్యామో ఆత్మవిమర్శ చేసుకోవాలి. సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలు ఓట్లు కురిపించవు; క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉండి, వారి సమస్యల పోరాటంలో భాగస్వాములైనప్పుడే విశ్వసనీయత పెరుగుతుంది. 2026 నాటి రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ప్రతిపక్షాలు పాత పద్ధతులను వీడాలి. కేవలం అధికార వ్యతిరేకత వస్తుందని ఆశించకుండా, ప్రజలకు ఒక బలమైన ప్రత్యామ్నాయ ఎజెండాను చూపాలి. ప్రజల ఆకాంక్షలకు, వారి అవసరాలకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోకపోతే, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే తరహా పరాభవాలు ఎదురుకాక తప్పదు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల తీర్పు అధికార పక్షానికి ఒక బాధ్యతను, ప్రతిపక్షాలకు ఒక హెచ్చరికను ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం. వారి నమ్మకాన్ని గెలవాలంటే భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన రాజకీయం ముఖ్యం. ఇప్పటికైనా విపక్షాలు మేల్కొని, ప్రజల నాడీకి అనుగుణంగా తమ రాజకీయ పంథాను మార్చుకుంటేనే వారి ఉనికి నిలబడుతుంది. లేదంటే కాలగర్భంలో కలిసిపోక తప్పదు.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం



## ఆదివాసీల ఆత్మగౌరవం..
# నాగోబా

తెలంగాణ వైవిధ్యభరితమైన సంస్కృతులకు నిలయం. అందులోనూ ఆదిలాబాద్ జిల్లాలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుపుకునే నాగోబా జాతర కేవలం ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు, అది మెసోరాం వంశీయుల చరిత్రకు, ఆదివాసీల అచంచల విశ్వాసానికి, ప్రకృతి ఆరాధనకు నిలువుటద్దం. ఇంద్రవెల్లి మండలం కేశ్లాపూర్ గ్రామంలో జరిగే ఈ ఉత్సవం దక్షిణాదిలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది. నాగోబా జాతర వెనుక వందల ఏళ్ల చరిత్ర ఉంది.

మెసోరాం వంశానికి చెందిన ఆదివాసీలు తమ ఆరాధ్య దైవమైన 'నాగేంద్రుడిని' (నాగోబా) దర్శించుకోవడానికి ఈ వేడుకను నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం, మెసోరాం వంశీయుల పూర్వీకులు సముద్ర తీరం నుండి పవిత్ర గంగాజలాన్ని తెచ్చి నాగోబాకు అభిషేకం చేసే సంప్రదాయాన్ని ప్రారంభించారు. నేటికీ ఆ సంప్రదాయం చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. ఈ జాతరలో ప్రతి ఘట్టం అత్యంత భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో కూడి ఉంటుంది. జాతర ప్రారంభానికి నెల రోజుల ముందే మెసోరాం వంశీయులు పాదయాత్రగా బయలుదేరి, మంచిర్యాల జిల్లాలోని హస్తినమడుగు (గోదావరి నది) నుండి పవిత్ర జలాన్ని తీసుకువస్తారు. వందల కిలోమీటర్ల ఈ యాత్రను వారు చెప్పులు లేకుండా, అత్యంత నిష్ఠతో పూర్తి చేస్తారు. పుష్య మాస అమావాస్య రోజున అర్ధరాత్రి వేళ నాగోబాకు గంగాజలంతో అభిషేకం చేయడం ద్వారా జాతర అధికారికంగా ప్రారంభమవుతుంది. ఈ జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం 'భేటింగ్ణ. గత ఏడాది కాలంలో మెస్రం వంశంలో కొత్తగా పెళ్లై వచ్చిన కోడళ్లను నాగోబా దైవానికి పరిచయం చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే వారు ఆ వంశీయులుగా గుర్తింపు పొందుతారు. నిజాం కాలం నుండి కొనసాగుతున్న 'ప్రజా దర్బార్ణ ఈ జాతరలో మరో ప్రధాన ఆకర్షణ. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఇది ఒక వేదికగా పనిచేస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా గిరిజనుల సమస్యలను విని పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. నాగోబా జాతరలో ఆదివాసీల కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గిరిజనుల సంప్రదాయ నృత్యమైన 'గుస్సాడీ' ప్రదర్శనలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. నెమలి పింఛాలతో అలంకరించుకున్న తలపాగాలతో, డప్పు వాయిద్యాల నడుమ వారు చేసే నృత్యం గిరిజన జీవనశైలిని ప్రతిబింబిస్తుంది. నాగోబా జాతర కేవలం పూజలకు మాత్రమే పరిమితం కాదు. ఇది చెల్లాచెదురైన బంధువులను కలిపే ఒక వారధి. వేల సంఖ్యలో మెస్రం వంశీయులు ఒకే చోట చేరి తమ కష్టసుఖాలను పంచుకుంటారు. గిరిజన సంస్కృతిని, ఆచారాలను తరువాతి తరాలకు అందించడంలో ఈ జాతర కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక పోకడలు ఎన్ని వచ్చినా, తమ పూర్వీకులు అప్పగించిన వారసత్వాన్ని గుండెల్లో దాచుకుని, ప్రకృతిని దైవంగా పూజించే ఆదివాసీల జీవన తత్వానికి నాగోబా జాతర ఒక నిదర్శనం.





కొత్తకోట శివానంద స్వామి

# నదీ స్నానం.. పాపహరణం

నేడు మౌని అమావాస్య సందర్భంగా..



పుష్య మాసంలో చివరి రోజు, మహా శివరాత్రి కి కొద్ది రోజుల ముందు వచ్చే అమావాస్యను మౌని అమావాస్యగా పిలుస్తారు. దీనినే చొల్లంగి అమావాస్యగా కూడా చెప్తారు. సంవత్సరంలో మొత్తం 12 అమావాస్యలు వస్తాయి. అందులో ఈ మౌని అమావాస్య కు చాలా ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఈ సంవత్సరం మౌని అమావాస్య జనవరి 18 వ తారీకు ఆదివారం వచ్చింది. ఈ రోజు ఈ అమావాస్య తిథి తెల్లవారుజామున 12:03 నిమిషాలకు మొదలై, తరువాతి రోజు అనగా జనవరి 19వ తేదీ తెల్లవారుజామున 01:21 నిమిషాలకు వరకు ఉంటుంది. అమృత స్నానాలు ఆచరించడానికి ఉత్తమ సమయం ఉదయం 05:27 నుండి 06:21 నిమిషాలు. ఈ రోజు తెల్లవారు జామునే లేచి చేసే స్నానం, దానం, జపం వెయ్యి రెట్లు ఎక్కువ ఫలితాన్ని ఇస్తాయని పురాణాల్లో చెప్పబడింది. ఈ రోజున సూర్యోదయానికి ముందే స్నానం చేయడం అత్యంత ముఖ్యం. ఈ రోజు నదుల్లో, సముద్రాల్లో చేసే స్నానం వల్ల జన్మ జన్మల పాపాలు తొలగిపోతాయని హిందువుల విశ్వాసం. అందుకే దీనిని అమృత స్నానంగా పిలుస్తారు. ప్రయాగ రాజ్ త్రివేణి సంగమంలో ఈ రోజు లక్షలాది మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారు. అయితే నదుల్లో స్నానాలు చెయ్యటం వీలుకాని వారు గంగాజలాన్ని నీటిలో కలుపుకుని ఇంట్లోనే తల స్నానాలు ఆచరించడం వల్ల కూడా మంచి ఫలితాలు కలుగుతాయి. అయితే ఆ స్నానం సమయంలో పవిత్రనదులైన గంగా, గోదావరి వంటి నదుల పేర్లను మనసులో స్మరించుకుంటూ చేయటంవల్ల ఆ నదుల్లో స్నానాలు చేసినంత ఫలితముంటుంది పండితుల మాట. స్నానం చేసిన తరువాత సూర్యుడికి నమస్కరించి అర్ఘ్యం (నీటిని వదలడం) ఇవ్వాలి. మీకు తెలుసా ఈ మౌని అమావాస్య రోజే నాగ సాధువులకు దీక్ష ఇస్తారు. ఈ రోజు పుణ్య స్నానాలకు మాత్రమే కాదు పితృ కార్యాలకు కూడా ఎంతో విశిష్టమైనది. ఈ రోజున చేసే తర్పణాలు, పిండ ప్రదానాలు నేరుగా మన పితృదేవతలకు అందుతాయని, తద్వారా పితృ దోషాలు తొలగి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. జాతకాల్లో పితృ దోషాలతో బాధలు పడేవారు, సంతానం కలగని వారు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వారు ఈ మౌని అమావాస్య నాడు పితృకార్యాలు తప్పక చేయాలి. దీనివల్ల వారి దోషాలు తొలగి పెద్దల దీవెనలతో మంచి జరుగుతుంది. అయితే ఈ రోజు పిండ ప్రదానాలు చేయలేని వారు సూర్యోదయానికి ముందే స్నానం ముగించి, దక్షిణం వైపు దీపం వెలిగించాలని, కాకులకు, పక్షులకు వీధి కుక్కలవంటి మూగ జీవాలకు ఆహారాన్ని అందించాలని కూడా పండితులు చెప్తున్నారు. పితృదేవతల పేరుతో బ్రాహ్మణులకు లేదా పేదలకు స్వయంపాకాన్ని అందించాలి.

మౌని అమావాస్య రోజు మరో ముఖ్యంగా పాటించవలసిన విషయం మౌనంగా ఉండటం. మనమందరం ఈ నోటితో ఎన్ని చెడు, అబద్ధాలు వంటి పాప కార్యక్రమాలు చేసి ఉండి ఉంటాము కాబట్టి ఈ రోజు మౌన వ్రతం చెయ్యటం వలన ఆ పాప ప్రక్షాళన జరుగుతుంది. ఇక రావి చెట్టు వద్ద దీపాన్ని వెలిగించడం, శివాలయంలో శివుడికి రుద్రాక్ష మాలను సమర్పించడం, దానాలు చెయ్యటం వల్ల శని రాహు కేతు దోషాలు కూడా తొలగిపోతాయని కూడా కొంత మంది పండితుల మాట. మానవజాతి మూల పురుషుడైన మనువు జన్మించిన ఈ రోజున పైన చెప్పినవి పాటిస్తే ఎంతో శుభకరం. ఈ రోజు మాంసాహారానికి దూరంగా ఉండి ఉల్లిపాయ వెల్లుల్లి వంటి తామసిక ఆహారాలను త్యజించి మౌనంగా ఉండటం వల్ల ఆధ్యాత్మికంగానే కాకుండా ఎంతో పుణ్యఫలం లభిస్తుంది.



రాం మనోహర్ శర్మ
బండపెల్లి, ప్రముఖ ఆధ్యాత్మిక పండితుడు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.